

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 28-01-2026 | సంపుటి - 26 | సంచిక -249 | రూ : 4 | పేజీలు: 8


## రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై
# గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన కేటీఆర్

- సింగరేణి బొగ్గు కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్
- కుంభకోణాన్ని ఆధారాలతో బయటపెట్టడంతో కాంగ్రెస్‌లో వణుకు ప్రారంభమైందన్న కేటీఆర్
- సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్



2లో





2లో

# మేడారం జాతరకు
# సర్వం సిద్ధం..

- నాలుగు రోజుల పాటు జరగనున్న మేడారం సమ్మక్కసారక్క మహాజాతర ప్రారంభం
- ఈ వేడుకకు రెండు కోట్ల మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా
- రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ. 251 కోట్లతో భారీ ఏర్పాట్లు

## పార్టీ సొంతిల్లు,
## ప్రభుత్వం కిరాయి ఇల్లు

: టీడీపీ శ్రేణులకు మంత్రి లోకేశ్ దిశానిర్దేశం



2లో

- రాష్ట్ర అభివృద్ధికి కనీసం 15 ఏళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని సూచన
- పార్టీ నేతలు అలక వీడి, ఐక్యంగా పనిచేయాలని పిలుపు
- శిక్షణ తరగతుల్లో నిత్య విద్యార్థిలా వెనుక కూర్చుని పాఠాలు విన్న లోకేశ్
- యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు

## ఢిల్లీలో చారిత్రక ఘట్టం.. భారత్-ఈయూ
# 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు



2లో

- 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించిన ఈయూ కమిషన్ అధ్యక్షురాలు
- 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత తుది రూపం
- భారత్ నుంచి 97 శాతం ఎగుమతులపై సుంకాల రద్దు
- వచ్చే ఏడాది నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం

**హైదరాబాద్ ఆకాశంలో 'వింగ్స్ ఇండియా' సందడి: రష్యా విమానాల విన్యాసాలు.. ఫ్లయింగ్ టాక్సీల తళుకులు**

2లో



2లో

# ముగిసిన హల్వా వేడుక...

**బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు!**

- కేంద్ర బడ్జెట్ 202627 తయారీలో ముగిసిన హల్వా వేడుక
- ఈ వేడుకతో ప్రారంభమైన బడ్జెట్ అధికారుల 'లాక్ ఇన్' పీరియడ్
- ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- మొబైల్ యాప్‌లోనూ అందుబాటులో ఉండనున్న బడ్జెట్ పత్రాలు
- ప్రసంగం పూర్తయ్యాకే యాప్‌లో బడ్జెట్ వివరాలు వెల్లడి

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం..
# పడగొట్టినవి నిలబెడదాం



2లో

- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రాయలసీమ, ప్రకాశం జిల్లాల సమగ్రాభివృద్ధిపై ప్రధానంగా దృష్టి
- 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పత్తులే లక్ష్యంగా కార్యాచరణ
- ప్రాధాన్యత క్రమంలో 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆదేశం
- గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రణాళికలు



2లో

## తెలంగాణలో మోగిన
## పురపోరు నగారా.. ఫిబ్రవరి 11న పోలింగ్

- 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల
- తక్షణమే రాష్ట్రంలో అమల్లోకి ఎన్నికల కోడ్
- రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియ
- ఫిబ్రవరి 16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

# ముగిసిన హల్వా వేడుక... బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు!

ఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 202627 రూపకల్పన ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. ఏటా బడ్జెట్ తయారీలో చివరి ఘట్టానికి సూచనగా నిర్వహించే సంప్రదాయ 'హల్వా వేడుక' మంగళవారం నాడు ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న బడ్జెట్ ప్రెస్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజరయ్యారు. బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ముగింపు దశకు వచ్చిందని, ఇక ప్రింటింగ్ ప్రారంభమవుతుందని ఈ వేడుక సంకేతాన్నిస్తుంది. ఈ వేడుక ముగిసిన వెంటనే బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న కీలక అధికారులు 'లాక్‌ఇన్' పీరియడ్‌లోకి వెళతారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే వరకు వీరంతా బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా పూర్తి ఏకాంతంగా గడుపుతారు. ఫోన్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలకు కూడా దూరంగా ఉంటారు. బడ్జెట్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన, రహస్య సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు దశాబ్దాలుగా ఈ కఠిన నిబంధనను పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి అధికారులకు హల్వాను వడ్డించి, శుభాకాంక్షలు తెలిపారు. హల్వా వేడుక అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రెస్‌ను సందర్శించారు. అక్కడ బడ్జెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన తుది ఏర్పాట్లను సమీక్షించారు. బడ్జెట్ రూపకల్పన, ముద్రణ పనుల్లో నిమగ్నమైన సిబ్బందికి, అధికారుల బృందానికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ తయారీ ప్రక్రియతో సంబంధం ఉన్న ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**డిజిటల్ రూపంలో బడ్జెట్ పత్రాలు**

గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగిస్తూ, ఈసారి కూడా బడ్జెట్ పత్రాలన్నీ ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేందుకు డిజిటల్ రూపంలో విడుదల చేయనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వార్షిక ఆర్థిక నివేదిక (బడ్జెట్), పద్దుల కేటాయింపులు (డిమాండ్ ఫర్ గ్రాంట్స్), ఆర్థిక బిల్లు వంటి కీలక పత్రాలన్నీ 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్' ద్వారా లభిస్తాయి. పార్లమెంటు సభ్యులు, సాధారణ ప్రజలు ఈ యాప్ ద్వారా బడ్జెట్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది. అలాగే, indiabudget.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా పత్రాలను యాక్సెస్ చేయవచ్చు. అయితే, ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే ఈ పత్రాలు యాప్‌లో, వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# తెలంగాణలో మోగిన పురపోరు నగారా.. ఫిబ్రవరి 11న పోలింగ్

తెలంగాణ రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల కోసం రేపటి నుంచి ఈ నెల 30 వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. వచ్చే నెల 16వ తేదీన కార్పొరేషన్‌లలో మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో 52 లక్షల 43 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 130 మున్సిపాలిటీలు ఉంటే వివిధ కారణాలతో 116 మున్సిపాలిటీలలో మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. కంట్రోల్ రూం నుంచి ఓటింగ్ ప్రక్రియను మానిటరింగ్ చేయనున్నట్లు తెలిపారు. రూ.50 వేలకు మించి నగదుకు లెక్క చూపవలసి ఉంటుందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయని తెలిపారు.

# మేడారం జాతరకు సర్వం సిద్ధం... వివరాలు..!

ములుగు: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతర రేపు (జనవరి 28) ప్రారంభం కానుంది. ములుగు జిల్లాలోని మేడారం గ్రామంలో జరిగే ఈ నాలుగు రోజుల వేడుకకు దేశం నలుమూలల నుంచి సుమారు రెండు కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌కు దాదాపు 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గిరిజన పుణ్యక్షేత్రం ఇప్పటికే జనసంద్రంగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా సహా పలు రాష్ట్రాల నుంచి గిరిజనులు, గిరిజనేతరులు ఈ జాతరకు పోటెత్తుతున్నారు. ఇప్పటికే గత కొద్ది రోజులుగా దాదాపు 10 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మల వీరత్వాన్ని, త్యాగాన్ని స్మరించుకుంటూ రెండేళ్లకోసారి ఈ జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

**ప్రభుత్వం భారీ ఏర్పాట్లు**

ఈ ఏడాది జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 251 కోట్లు ఖర్చు చేసింది. 21 శాఖలకు చెందిన 42,000 మందికి పైగా అధికారులు, సిబ్బందిని, 2000 మంది ఆదివాసీ వాలంటీర్లను భక్తుల సేవ కోసం నియమించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా 13,000 మంది పోలీసులను మోహరించారు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డ్రోన్లతో జాతరను పర్యవేక్షిస్తున్నారు. 1,418 ఎకరాల్లో 42 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. జంపన్న వాగు వద్ద 200 మంది గజ ఈతగాళ్లను, 30 వైద్య శిబిరాల్లో 5,192 మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్యం కోసం 5,000 మంది కార్మికులు, 5,700 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. భక్తుల రవాణా కోసం టీజీఎస్‌ఆర్టీసీ 4,000 ప్రత్యేక బస్సులను, దక్షిణ మధ్య రైల్వే 28 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. పర్యాటక శాఖ హనుమకొండ నుంచి మేడారానికి హెలికాప్టర్ సేవలను కూడా అందిస్తోంది. రౌండ్ ట్రిప్‌తో కూడిన వీఐపీ దర్శనానికి రూ. 35,999, జాతర ఏరియల్ వ్యూ కోసం ఒక్కొక్కరికి రూ. 4,800 చొప్పున ఛార్జీలను నిర్ణయించారు.

**జాతర నేపథ్యం, సంప్రదాయాలు**

కాకతీయ పాలకుల పన్నుల విధానాన్ని ఎదిరించి పోరాడిన గిరిజన వీరవనితలు సమ్మక్క, ఆమె కుమార్తె సారక్క (సారలమ్మ)ల శౌర్యాన్ని స్మరించుకుంటూ ఈ జాతరను నిర్వహిస్తారు. కోయ తెగకు చెందిన ఈ తల్లీకూతుళ్లను గిరిజనులు దేవతలుగా కొలుస్తారు. పోరాటంలో అలసిపోయిన సమ్మక్క చిలుకలగుట్ట వైపు వెళ్లి అదృశ్యమయ్యిందని, ఆమె కోసం వెతికిన గిరిజనులకు ఓ వెదురు చెట్టు కింద కుంకుమ భరిణె మాత్రమే లభించిందని స్థానిక కథనం. అప్పటి నుంచి రెండేళ్లకోసారి గిరిజన పూజారులు వెదురు వనంలో ప్రత్యేక పూజలు చేసి, కుంకుమ భరిణె, ఎర్రటి వస్త్రం చుట్టిన వెదురు కర్రను సమ్మక్క ప్రతిరూపంగా భావించి గద్దెల వద్దకు తీసుకువస్తారు. అంతకుముందు రోజు కన్నేపల్లి నుంచి సారలమ్మను తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించడంతో జాతర అధికారికంగా మొదలవుతుంది. భక్తులు తమ బరువుకు సమానమైన బెల్లాన్ని (బంగారం) అమ్మవార్లకు సమర్పిస్తారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించడం ఇక్కడి ముఖ్యమైన సంప్రదాయం.

# పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు

అమరావతి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. పార్టీ అనేది సొంతిల్లు వంటిదని, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిదని అభివర్ణించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నూతనంగా నియమితులైన పార్లమెంట్ కమిటీల కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యాలయానికి తగిన సమయం కేటాయించాలని లోకేశ్ సూచించారు. "పార్టీ మన సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది. చంద్రబాబు గారికి ఎంత పని ఒత్తిడి ఉన్నా వారానికి ఒకసారి పార్టీ ఆఫీసుకు వచ్చి కార్యకర్తలను కలుస్తున్నారు, శిక్షణ కార్యక్రమాలకు హాజరవుతున్నారు" అని గుర్తుచేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉందని, కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసికట్టుగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. కేంద్ర సహకారంతోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగామని, అమరావతి, పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ కూడా తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

*** అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం**

పార్టీ నాయకులు చిన్న చిన్న అలకలు వీడి ఐక్యంగా పనిచేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనపై ఎన్నో అక్రమ కేసులు పెట్టారు. ఇప్పుడు అలకల వల్ల మనమే నష్టపోతాం. ఏదైనా సమస్య ఉంటే పార్టీలోనే పోరాడాలి" అని హితవు పలికారు. కనీసం 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగితేనే రాష్ట్రాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసుకోగలమని పవన్ కల్యాణ్ కూడా చెప్పారని గుర్తుచేశారు. కూటమిలో చిన్న చిన్న సమస్యలు సహజమని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగాలన్నారు. మన మధ్య విభేదాలు సృష్టించడానికి వైసీపీ ప్రయత్నిస్తుందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

**పదవిని బాధ్యతగా స్వీకరించాలి**

వ్యక్తులు శాశ్వతం కాదని, తెలుగుదేశం పార్టీయే శాశ్వతమని లోకేశ్ స్పష్టం చేశారు. "ఒక వ్యవస్థ కింద మనం అందరం నడుచుకోవాలి. పదవిని బాధ్యతగా స్వీకరించాలి. పార్టీ వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఒక కార్యకర్తగా పనిచేస్తున్నా" అని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, పార్టీ కార్యక్రమాలను 'మై టీడీపీ యాప్' ద్వారానే చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు నిరంతర ప్రక్రియ అని, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. అనంతరం, ఆయన స్వయంగా శిక్షణ తరగతులకు హాజరై, వెనుక వరుసలో కూర్చుని ఒక నిత్య విద్యార్థిలా పాఠాలు వినడం అందరినీ ఆకట్టుకుంది.

*** స్వయంగా ఆహ్వానం పలికిన మంత్రి లోకేశ్**

అంతకుముందు, వర్క్‌షాప్‌కు హాజరైన పార్లమెంట్ కమిటీ సభ్యులకు మంత్రి లోకేశ్ స్వయంగా ఎదురెళ్లి స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి వారితో ఫోటోలు దిగారు. ఇదే సమయంలో, నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు జరిగాయి. పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం... పడగొట్టినవి నిలబెడదాం

అమరావతి: రాష్ట్రంలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన నిర్మాణాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను ప్రపంచంలోనే అతిపెద్ద ఉద్యాన క్లస్టర్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో 10 జిల్లాలను ఉద్యాన కేంద్రాలుగా మార్చే సమీకృత అభివృద్ధి ప్రణాళికలపై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**20 ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళికలు**

గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, అనేక ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టిందని ఈ సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, 10 జిల్లాల పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తక్కువ నిధులతో త్వరగా పూర్తయ్యే వాటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఈ ఏడాదిలోనే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణకు వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గాలేరునగరి ద్వారా కృష్ణా జలాలను కడప వరకు తీసుకెళ్లే అంశంపై దృష్టి సారించాలన్నారు. మొత్తంగా 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు, మరో 4.30 లక్షల ఎకరాల స్థిరీకరణకు నీరందించవచ్చని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ప్రాజెక్టులు చేపట్టాలని, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయితే గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వరకు తీసుకెళ్లి, పోలవరంవంశధార నదుల అనుసంధానం చేపట్టవచ్చని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

*** ప్రపంచస్థాయి ఉద్యాన హబ్‌గా రాయలసీమ**

ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను పండించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో 201 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. మూడేళ్లలో ఉద్యాన సాగు విస్తీర్ణాన్ని 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. దుబాయ్‌కి చెందిన డీపీ వరల్డ్ సంస్థ ఏపీలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిందని సీఎం వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన గ్రామీణ రహదారుల నెట్‌వర్క్, లాజిస్టిక్స్, మార్కెట్, గ్లోబల్ కనెక్టివిటీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ బృహత్తర ప్రణాళికల అమలుకు పూర్వోదయ, సాస్కి, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పోర్ట్ కనెక్టివిటీ, గోదాములు, కోల్డ్ చైన్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# హైదరాబాద్ ఆకాశంలో 'వింగ్స్ ఇండియా' సందడి

హైదరాబాద్: భాగ్యనగరం మరో అంతర్జాతీయ వేడుకకు వేదికైంది. ఆసియాలోనే అతిపెద్ద సివిల్ ఏవియేషన్ ఎగ్జిబిషన్ 'వింగ్స్ ఇండియా 2026' బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఈ ఈవెంట్ కేవలం ఎయిర్ షో మాత్రమే కాదు, భారత దేశ విమానయాన రంగ భవిష్యత్తును, సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప వేదిక.



**మేక్-ఇన్-రష్యా విమానాల రాక**

ఈ ఏడాది ప్రదర్శనలో రష్యాకు చెందిన రెండు సరికొత్త విమానాలు 'సూపర్‌జెట్', 'Il114300' ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇవి పూర్తిగా రష్యా స్వదేశీ సాంకేతికతతో, ముఖ్యంగా రష్యా తయారీ PD8, TV7117ST01 ఇంజిన్లతో రూపొందించబడ్డాయి. మాస్కో సమీపంలోని జుకోవ్స్కి నుంచి పది దేశాల గగనతలం మీదుగా ప్రయాణించి ఈ విమానాలు హైదరాబాద్ చేరుకున్నాయి. సందర్శకులు ఈ విమానాల లోపలి భాగాలను నేరుగా చూసే అవకాశం కల్పించారు.

**అర్బన్ ఫ్లయింగ్ టాక్సీలు:** భవిష్యత్తులో నగరాల్లో ప్రయాణించే ఎగిరే టాక్సీల నమూనాలు ఈ వేడుకలో ప్రదర్శించనున్నారు.

**ఎయిర్ ఇండియా కొత్త లుక్:** ఎయిర్ ఇండియా తన B7879 విమానాల కోసం రూపొందించిన సరికొత్త ప్రీమియం క్యాబిన్ ఇంటీరియర్స్ ఇక్కడ ఆవిష్కరించనుంది.

**ఏరియల్ డిస్‌ప్లే:** గగనతలంలో పైలట్ల సాహసోపేత విన్యాసాలు సందర్శకులను కట్టిపడేయనున్నాయి.

**కెరీర్ అవకాశాలు:** విమానయాన రంగంలో స్థిరపడాలనుకునే యువతకు నిపుణులతో సంభాషించే అవకాశం ఉంటుంది.

**టిక్కెట్లు, సందర్శన వివరాలు**

ఈ ప్రదర్శన జనవరి 28 నుంచి 31 వరకు కొనసాగుతుంది. డిజిటల్ ఎంట్రీ ద్వారా ఈజీ పద్ధతిలో ప్రవేశం కల్పించేందుకు బుక్ మై షో (BookMyShow)లో టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్‌ను గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా నిలబెట్టే ఈ ప్రదర్శనను చూసేందుకు నగరవాసులు పెద్ద ఎత్తున తరలివస్తారని

# ఢిల్లీలో చారిత్రక ఘట్టం.. భారత్‌ఈయూ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు

ఢిల్లీ: భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఖరారైంది. 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత కుదిరిన ఈ ఒప్పందాన్ని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. ఈరోజు న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలతో జరిగిన 16వ శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేశారు. ఈ ఒప్పందం ద్వారా భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు కానున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, రత్నాలు, లెదర్ వంటి రంగాలకు ఇది భారీ ఊతాన్ని ఇవ్వనుంది. అదే సమయంలో యూరప్ కార్లు, యంత్ర పరికరాలకు భారత మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం అవుతుంది. "ఈరోజు యూరప్, భారత్ చరిత్ర సృష్టిస్తున్నాయి. మేం 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'ను ముగించాం. ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూర్చేలా 200 కోట్ల మంది ప్రజలతో స్వేచ్ఛా వాణిజ్య క్షేత్రాన్ని సృష్టించాం" అని ఉర్సులా 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఈ ఒప్పందం రెండు ప్రపంచ దిగ్గజాల మధ్య భాగస్వామ్యానికి చక్కటి ఉదాహరణ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వాణిజ్యంతో పాటు రక్షణ, భద్రత, వాతావరణ మార్పులు, కీలక సాంకేతికతలు వంటి అంశాలపై కూడా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. అమెరికా, చైనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇతర ప్రాంతాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని చూస్తున్న ఐరోపాకు ఈ ఒప్పందం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ఒప్పందం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన కేటీఆర్

సింగరేణి బొగ్గు కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం ఈరోజు గవర్నర్‌ను కలిసి సింగరేణిలో బొగ్గు కుంభకోణం జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సింగరేణిలో దోపిడీ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చామని, ఆధారాలతో బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వణుకు మొదలైందని అన్నారు. కుంభకోణాన్ని బహిర్గతం చేశాక అధికార పార్టీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని అన్నారు. అందుకే ప్రజల దృష్టిని మరల్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారని ఆరోపించారు. ఫుట్‌బాల్ ఆటకు రూ.10 కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సీఎం అంటే కోల్ మాఫియా నాయకుడిగా సింగరేణి కార్మికులు భావించే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సింగరేణి టెండర్లలో పారదర్శకత లేదని అన్నారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రతి రైతు ఫార్మా రిజిస్ట్రీ ఐడిని నమోదు చేయించుకోవాలి

**: సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ ఐడిని నమోదు చేయించుకోవాలని సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామంలో ఎల్లగిరి వ్యవసాయ విస్తరణ అధికారి చాడ లక్ష్మణ్ ఆధ్వర్యంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ జువ్వి నర్సింహ్మ హాజరై, మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిలైజేషన్ చేయాలని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టు ప్రారంభించడం జరిగిందన్నారు. రెవిన్యూ శాఖ ద్వారా సేకరించిన భూమి




యాజమాన్య వివరాలను ఆధార్ కార్డుతో అనుసంధానం చేసి ప్రతి రైతుకు ప్రత్యేక ఫార్మర్ ఐడిని కేటాయించబడుతుందన్నారు. రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ పథకాలు సులభంగా పొందవచ్చన్నారు. పీఎం కిసాన్ సహాయానికి ఫార్మర్ ఐడి తప్పనిసరి, రైతు వివరాలు ఖచ్చితంగా నమోదైతే పారదర్శకత పెరుగుతుందని, భీమా సబ్సిడీలు రుణాలు, ప్రభుత్వ పథకాలు త్వరగా లభించే అవకాశం ఉందన్నారు. ఒకే ఐడితో లబ్ది నేరుగా బ్యాంక్ ఖాతాలోకి వస్తుందని, భవిష్యత్తు పథకాల ప్రయోజనాలు సులభం స్పష్టమైన గుర్తింపు తో మోసాలు తగ్గుతాయన్నారు. రైతు రిజిస్ట్రేషన్ కు ఆధార్ కార్డు నెంబరు, భూమి పాసుబుక్ వివరాలు, ఆధార్ కు లింక్ అయిన మొబైల్ నెంబర్ తప్పనిసరిగా అవసరమని తెలిపారు. ఈ ఫార్మర్ రిజిస్ట్రీ వ్యవసాయ విస్తరణ అధికారి, మీ సేవలో చేయించుకోగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పిసాటి బాల్ రెడ్డి, ఏనుగు లింగారెడ్డి, ఊదరి నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ మండల అధ్యక్షునిగా పల్లేటి వినోద్ కుమార్



నాంపల్లి, ప్రజాస్ఫూర్తి: బహుజన్ సమాజ్ పార్టీ నాంపల్లి మండల అధ్యక్షునిగా మండలంలోని గ్రామానికి చెందిన పల్లేటి వినోద్ కుమార్ ను నియమిస్తూ ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ ఉత్తర్వులు జారీ చేశారు. నాంపల్లి మండల కేంద్రంలో పల్లేటి వినోద్ కుమార్ కు నియామకపు ఉత్తర్వులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పల్లేటి వినోద్ కుమార్ మాట్లాడుతూ బహుజన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానన్నారు. బీఎస్పీ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. తన ఎన్నికకు సహకరించిన బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు కన్ సాన్ పల్లి లో ఉచిత వైద్య శిభిరం

* **సర్పంచ్ సునితమహిపాల్ ఆధ్వర్యంలో నిర్వహణ**

అందోలు, ప్రజాస్ఫూర్తి : అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ సునీత మహిపాల్ ఆధ్వర్యంలో జోగిపేట సురక్ష హస్పిటల్ సౌజన్యంతో బుధవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు. చిన్న పిల్లల్లో తరుచుగా సంభవించే పోషకాహార లోపం, సీజనల్ వ్యాధులు వంటి ఆరోగ్య సమస్యలను అధిగమించి మంచి ఆరోగ్యం పొందెందుకు చిన్న పిల్లల వైద్యనిపుణులు ఎంబిబిఎస్, ఎండి పిడియాట్రీషన్ (నీలోఫర్) డాక్టర్ విద్యాసాగర్ పాల్గొని వైద్య సలహాలతో పాటు, అవసరమైన పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేయబడుతాయన్నారు. గ్రామం లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, చిన్న పిల్లలతో కలిసి ఉచిత వైద్య శిభిరం ద్వారా ఆరోగ్య పరీక్షలు చేసుకొని అవసరమైన వైద్య సలహాలు, మందులు పొందేందుకు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


## వాహనదారులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

* **వాహనదారులకు ఉచితంగా హెల్మెట్ ల పంపిణీ**
* **చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: వాహనదారులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్ అన్నారు. ట్రాఫిక్ భద్రత వారోత్సవాలలో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంల లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో బొబ్బిళ్ళ మురళి ఆర్థిక సహకారంతో హెల్మెట్ లను సీఐ విజయ్ మోహన్ చేతుల మీదుగా మంగళవారం వాహనదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపద్దని వాహనదారులకు సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం ప్రాణహానితో సమానమన్నారు. హెల్మెట్ లకు ఆర్థికంగా సహకరించిన బొబ్బిళ్ళ మురళిని, ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేయడంలో ముందున్న లయన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సైదిరెడ్డి, ఏఎస్ఐ కాంట్రగడ్డ శ్రీనివాస్, లైన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షుడు తిరందాసు జగన్నాథం, ప్రధాన కార్యదర్శి అతార్ పాషా, డిసి నెంబర్స్ గోశిక కరుణాకర్, ఉప్పు ఆంజనేయులు, కాసుల వెంకటేశం, వనం రాజు, సూరోజు సత్యనారాయణ చింతల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు



చేవెళ్ల, (ప్రజాస్ఫూర్తి ) : చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఊరెళ్ల గ్రామ వాసి బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు మంగళవారం చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య సమక్షంలో సుమారు 100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వార్డుమెంబర్ చాన్, అబ్దుల్ గని, మైబూబ్, జాంగిర్, మహమ్మద్ పాషా, మహమ్మద్ జాంగిర్, హైమత్, షబ్బీర్, సీహెచ్.రవి, ముస్తఫా, హాఫీజ్, హరికృష్ణ వారి అనుచరులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పుకున్నారు. అనంతరం చేవెళ్ల మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారం ఉన్నా.. లేకున్నా.. నిబద్ధతలో పనిచేశా

**: 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుండి అవకాశం ఇవ్వండి**

* **చెరుకు లింగస్వామి గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. అధికారం కోల్పోయినా.. పార్టీ కోసం అహర్నిశలు నిబద్ధతతో పనిచేశానని కాంగ్రెస్ పార్టీ మాజీ చౌటుప్పల్ పట్టణ అధ్యక్షుడు చెరుకు లింగస్వామి గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు ఊహ తెలిసినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ అంటే అమితమైన అభిమానం ఉందన్నారు. తన తండ్రి చెరుకు యాదయ్య కాంగ్రెస్ పార్టీలో సీనియర్ కార్యకర్తగా కొనసాగుతూ, తనను చిన్నప్పటి నుంచే కాంగ్రెస్ పార్టీకి అభిమానిగా పెంచాడని గుర్తు చేశారు. 2007నుంచి 2009వరకు యువజన కాంగ్రెస్ చౌటుప్పల్ పట్టణ ఉపాధ్యక్షునిగా, 2009నుంచి 2014వరకు యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షునిగా, 2014నుంచి నేటి వరకు రాజీవ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షునిగా పదవులు నిర్వహించానన్నారు. అప్పటి నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి అభిమానిగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేశానన్నారు. ప్రస్తుత మునుగోడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 2009లో భువనగిరి ఎంపీగా బరిలోకి దిగిన నాటి నుంచి మొదలుకొని నేటి వరకు ఆయన అడుగుజాడల్లోనే నడుస్తుండానన్నారు. తన వార్డు నుంచి గతంలో రిజర్వేషన్ పరంగా అవకాశాలు రాలేదని, ప్రస్తుతం బీసీ జనరల్ రావడంతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో బరిలోకి దిగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా రెండు దశాబ్దాలకు పైగా పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తకు అవకాశం ఇచ్చి, తనను నాయకునిగా తీర్చిదిద్దాలని కోరారు.



## పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి


* **రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, పోలీసు ఉన్నతాధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందని, నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలు, భద్రత, వెబ్ కాస్టింగ్ తదితర ఏర్పాట్లలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐడీఓసి కార్యాలయం నుంచి జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ పాల్గొని, కొత్తగూడెం కార్పొరేషన్ (60 డివిజన్లు), అశ్వరావుపేట (22 వార్డులు), ఇల్లందు (24 వార్డులు) మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అధికారులు సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధితో పోరాటం

* **వైద్యానికి రూ.8లక్షల అవసరం**
* **ఆపన్న హస్తం కోసం ఎదురు చూపులు**

ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల : కష్టాలు ఆ కుటుంబాన్ని వదలడం లేదు. ఒకవైపు పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులు, మరోవైపు ప్రాణాంతక వ్యాధి.. వెరసి రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో నివాసముండే బేడ బుడగ జంగాలకు చెందిన చింతల పద్మ కుటుంబం వీధిన పడే స్థితికి చేరుకుంది. సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన పద్మకు అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో కుటుంబం ఒక్కసారిగా ఛిన్నాభిన్నమైంది. పద్మ దంపతులకు ఉన్న ఇద్దరు ఆడ పిల్లల పెళ్లిళ్ల కోసం గతంలోనే భారీగా అప్పులు చేశారు. ఆ అప్పులు తీరకముందే పద్మకు అనారోగ్యానికి గురికావడంతో ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. పిల్లల పెళ్లిళ్ల బాధ్యతలు తీర్చుకున్న తృప్తి కూడా లేకుండానే, ఇప్పుడు తల్లి ప్రాణాలు కాపాడుకోవడానికి పైసా లేక ఆమె భర్త, పిల్లలు అల్లాడిపోతున్నారు. ప్రస్తుతం కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న పద్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా



ఉందని, వైద్యం కోసం 8 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెల్చి చెప్పారు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబానికి 8 లక్షల రూపాయలంటే ఒక కొండంత భారం. ఇప్పటికే చేతిలో ఉన్న కొద్ది పాటి సొమ్ము ఖర్చయిపోవడంతో, ఇప్పుడు కనీసం మందులు కొనడానికి కూడా గతి లేని పరిస్థితి నెలకొంది. కిడ్నీ , ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న పద్మను కాపాడుకునేందుకు ఆ కుటుంబం దాతల సాయం కోసం దీనంగా ఎదురుచూస్తోంది. ఒక్క చిన్న సహాయం పద్మ జీవితంలో వెలుగులు నింపగలదు. దాతలు, ఎన్జీఓలు, మరియు మండల ప్రజాప్రతినిధులు స్పందించి అండగా నిలవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సాయం చేయదలచిన వారు ఫోన్ పే/గూగుల్ పే: 8184813239

## ప్రజాస్ఫూర్తి క్యాలెండర్ ఆవిష్కరించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి: నూతన సంవత్సర క్యాలెండర్ ను 124 అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆవిష్కరించారు. ప్రజాస్ఫూర్తి ఎడిటర్, టియుడబ్ల్యూ జె మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు తో కలిసి ఎల్లమ్మబండ లో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక మరింత ప్రజాధారణ పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్ఫూర్తి ప్రతినిధి నాగరాజు, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, కె.నరసింహులు, మన్యం, ఆది నారాయణ, గిరి, రాఘవేంద్ర,



కృష్ణ, శ్రీను, బి.నరసింహ, రమేష్, సురేష్, సుధాకర్, సత్తయ్య, రమేష్, రవీందర్. తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో ఘనంగా ఆయుష్ మెడికల్ క్యాంపు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:తెలంగాణ ప్రభుత్వం యోగ అధ్యయన పరిషత్ , ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం పట్టణంలోని పెన్షనర్ ఆఫీస్‌లో ఆయుష్ మెడికల్ క్యాంపు, నామ్ ప్రకృతి వైద్యం , యోగ శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ శాఖ డైరెక్టర్ అండ్ సెక్రటరీ డా. పెరుగు శ్రీకాంత్ బాబు, అలాగే కొనిజెటి రోషయ్య నేచర్ క్యూర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ఏ. మాలతీ శ్యామల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో పెన్షనర్లు భారీ సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో అక్యూపంక్చర్, డైట్ కౌన్సిలింగ్, యోగ థెరపీ, ఫిజియో థెరపీ వంటి సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ ఏ. నవీన్ జ్యోతి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా. శ్రీకృష్ణ, డీపీఎం డా. మహేష్ గౌడ్, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి డా. వెంకటేశ్వర్ రావు, భద్రాచలం మెడికల్ ఆఫీసర్లు డా. కనక లక్ష్మి, ఆయుష్ సిబ్బంది, యోగ ఇన్‌స్ట్రక్టర్లు, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

## ఇంకా విషమంగానే కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి : నిమ్స్ వైద్యులు




ప్రైవేట్ నర్సింగ్ కాలేజీలు, స్కూళ్లలో బాండ్ సిస్టమ్ అమలు అనైతికమని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ స్పష్టం చేసింది. నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల నుంచి సర్వీస్ బాండ్లు తీసుకోవడం, వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేసి అనుబంధ ఆసుపత్రుల్లో స్టాఫ్ నర్సులుగా పని చేయాలని బలవంతం చేయడం తీవ్రమైన తప్పిదమని పేర్కొంది. ఈ తరహా చర్యలు విద్యార్థుల స్వేచ్ఛ కు విరుద్ధమని, నైతిక విలువలకు భంగం కలిగించేవని కౌన్సిల్ అభిప్రాయపడింది. బాండ్ విధానం అమలు చేస్తూ సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వకపోతే, సంబంధిత సంస్థలపై ఐఎన్‌సీ చట్టం సెక్షన్-14 కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నర్సింగ్ ప్రోగ్రామ్స్ రెగ్యులేషన్ 2020, గతంలో జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ల ప్రకారం ఇలాంటి బాండ్ విధానం నిషేధితమని కౌన్సిల్ మరోసారి గుర్తు చేసింది. ఈ విషయంపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే, తప్పిదానికి పాల్పడిన నర్సింగ్ సంస్థలపై తగిన చర్యలు తప్పవని పేర్కొంది.

**ఇంకా విషమ స్థితిలోనే కానిస్టేబుల్ సౌమ్య**

నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల దాడిలో తీవ్రంగా గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని నిమ్స్ వైద్యులు తెలిపారు. ఆమె ఆరోగ్యంపై మంగళవారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. జనవరి 25న అర్ధరాత్రి 1.40 గంటలకు అత్యవసర పరిస్థితిలో సౌమ్యను నిమ్స్‌కు తరలించగా, వెంటిలేటర్ సహాయంతో చికిత్స ప్రారంభించారు. ప్రస్తుతం ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలోని రికవరీ ఐసీయూ బెడ్ నెంబర్ 3లో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం స్పృహలోకి వచ్చే ఆదేశాలను అనుసరిస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు. గ్లాస్గో కోమా స్కేల్ స్కోర్ మెరుగుపడిందని, పల్స్ రేటు, రక్తపోటు క్రమంగా నియంత్రణలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. నోరాడ్రెనలిన్, వాసోప్రెస్సిన్ వంటి మందులతో పాటు అవసరమైన వైద్య మద్దతు కొనసాగుతోందన్నారు. కిడ్నీ పనితీరుకు సహాయంగా సీఆర్ఆర్‌టీ (కంటిన్యూయస్ రీనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ) అందిస్తున్నామని తెలిపారు. అల్ట్రాసౌండ్ పరీక్షలో కాలేయానికి గాయం ఉన్నట్లు నిర్ధారణ కాగా, గుండె పనితీరు సక్రమంగానే ఉందని వైద్యులు పేర్కొన్నారు. ఇప్పటికే రక్తం, ప్లేట్లెట్లు, ఎఫ్ఎఫ్‌పీ యూనిట్లు అందించినట్లు వెల్లడించారు. వెంటిలేటర్‌పై 30 శాతం ఆక్సిజన్‌తో చికిత్స కొనసాగుతుండగా, ఆక్సిజన్ సాచురేషన్ 100 శాతం ఉన్నట్లు తెలిపారు. అన్ని శాఖల వైద్య బృందం నిరంతర పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నప్పటికీ, సౌమ్య ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉందన్నారు.

# కూకట్ పల్లి రాందేవ్ రావు హాస్పిటల్ కి అరుదైన పురస్కారం



కూకట్ పల్లి , ప్రజాస్ఫూర్తి : కూకట్ పల్లి రాందేవ్ రావు అసుపత్రికి అరుదైన పురస్కారం లభించింది. 77 వ గణతంత్ర దినోత్సవాన్నీ పురస్కరించుకొని సోమవారం గవర్నర్ ఎక్సలెన్సీ 2025 ఎట్ హోమ్ కార్యక్రమాన్ని లోక్ భవన్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ , సుధాదేవ్ వర్మ, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, కేంద్ర మంత్రి జీ.కిషన్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాందేవ్ రావు ఆసుపత్రి చేస్తున్న సేవలను గుర్తించి రాందేవ్ రావు హాస్పిటల్ కి గవర్నర్ ద్వారా తెలంగాణ ఉత్తమ హాస్పిటల్ గా ఎంపిక చేశారు. గ్రామీణ , ఫిలాంత్రోపీ వైద్య సేవల నిమిత్తము రాందేవ్ రావు ఆసుపత్రి ని ఎంపిక చేశారని నిర్వహకులు తెలిపారు. ఆరోగ్య శిభిరాలు, పాఠశాల ఆరోగ్య కార్యక్రమం, వ్యాధి నిరోధక టీకాలు, ఉచిత కంటి , శస్త్ర చికిత్సల ద్వారా సేవలందించి గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ లో రాందేవ్ రావు ఆసుపత్రి సేవలు మరువలేనివి.ఈ పురస్కారం 2 లక్షల రూపాయలు నగదు బహుమతి , అవార్డు గ్రహీతలకు ప్రశంస పత్రాన్ని లోక్ భవన్ హైదరాబాద్ నందు ఇచ్చి గవర్నర్ సత్కరించారు.ఈ అవార్డు ను రాందేవ్ రావు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కే కమలాకర్ అందుకున్నారు.ఈ కార్యక్రమంలో అధికార పార్టీ కార్యకర్తలతో పాటు బీజేపీ, బీఆర్ఎస్,ఐఏఎస్, ఐపీస్, విదేశీ రాయభారులు, స్వతంత్ర సమరయోధులు , స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, రాష్ట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు ,అడలూరి లక్ష్మన్, మాజీ గవర్నర్ బండారు దత్తత్రేయ, ఎంపి ఈటెల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు, కె కేశవరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రమణ, డి శ్రవణ్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు, డీజీపీ శ్రీధర్ రెడ్డి పలువురు హాజరయ్యారు. అనంతరం మంగళవారం రాందేవ్ రావు ఆసుపత్రి మేనేజ్ మెంట్ అభినందన కార్యక్రమం నిర్వహించి ఉద్యోగులనందర్నీ అభినందించింది ఈ అవార్డు ద్వారా రాందేవ్ రావు ఆసుపత్రి బాధ్యత సమాజం లో మరింత పెరిగిందని, రోగులను మరింత జాగ్రత్తగా, భద్రంగా, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యజమాన్యం రంతిదేవ్ రావు, మీరా రావు, విక్రందేవ్ రావు, జ్యోతి రావు, విజయలక్ష్మి,పృధ్వీరెడ్డి, భారతి రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి , ప్రశాంత్ రెడ్డి, అపర్ణ రావు,జీవి రమణ తెలిపారు. ఈ కార్యక్రమం లో సీఈఓ డాక్టర్ యోబు, డాక్టర్స్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐ బలపరిచిన అభ్యర్థులని గెలిపించాలి

*** బచ్చనగోని గాలయ్య**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని సీపీజిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య కోరారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల మౌళిక వసతులైన నీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్యం, సీసీ రోడ్ల నిర్మాణం కోసం సీపీఐ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించామని గుర్తు చేశారు. కమ్యూనిస్ట్ లు ఎల్లప్పుడు ప్రజా సంక్షేమం కోసమే పాటుపడతారని, సమస్యల్ని గుర్తించి వాటి పరిష్కారం కోసం రాజీలేకుండ పోరాటం చేసేవాళ్ళు కమ్యూనిస్టులన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల కోసం నిత్యం పోరాడేది సీపీఐ పార్టీ అని, ఎన్నికల్లో అనేకమంది ప్రజల సమస్యలు మీద అవగాహన లేకున్నా, కేవలం ఆర్థిక బలాన్ని నమ్ముకొని పోటీకి సిద్ధమవుతున్నారన్నారు. ప్రజలంతా గమనించాలని, ప్రలోభాలకు గురికాకుండా, అనునిత్యం ప్రజల కోసం, ప్రజల గొంతుగా పనిచేసే కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, కొందూరి వెంకటేష్, టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్, దాసరి అంజయ్య, బోయ మంకులు, దాసరి మనోహర్, గంగనాబోయిన నర్సింహా, గుండెబోయిన భాస్కర్, నీళ్ల బిక్షపతి, దాసరి కృష్ణ, బెదరకోట యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వాని ఆలయ హుండీ లెక్కింపు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరిగుట్ట కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి 55 వ బ్రహ్మోత్సవాలుఈ నెల 22 నుండి 24 వరకు మూడు రోజులపాటు అంగరంగా వైభవంగా జరిగాయి.మంగళవారం ఆలయ ప్రధాన మంటపంలో పర్యవేక్షణాధికారి కే. అంజయ్య,ఈఓ.జె.కృష్ణమాచార్యులు, ఆధ్వర్యంలో చైర్మన్ కానుగంటి నరేందర్ రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, కే.బుచ్చిరెడ్డి,ఆర్.వేణుగౌడ్,కే. రవీందర్,సునీత,అర్చకులు మాడభూషిని విజయకుమార్ చార్యులు, శేషాచార్యులు,జగద్గిరిగుట్ట పోలీసుల,వేద పాఠశాల విద్యార్థుల,పలువురు సిబ్బంది,భక్తులు మధ్య హుండీ ఆదాయాన్ని లెక్కించారు.తై బజార్ ఆదాయం రూ. 2.95.800,శ్రీ స్వామి వారి కట్నాలు.రూ.3.11.568,హుండీ ఆదాయం రూ.1.76.084,ఇతరత్రా ఆదాయం రూ.3.00.335. మొత్తం రూ.10.83.787 వివిధ పద్దులపై ఆదాయం వచ్చిందని ఇందులో భాగంగా రూ.6.98.850 పలు పద్దులపై ఖర్చు చేసినట్లు ఈవో లిఖితపూర్వకంగా వెల్లడించారు.55 వ బ్రహ్మోత్సవాల్లో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకులో జమ చేశామని ఆయన తెలిపారు.గత సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో రూ.10.02.829 రాగ ఈ సంవత్సరం రూ.80.958 నగదు అధికంగా వచ్చిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

## సంక్షేమ సంఘసభ్యులు బస్తీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

*** జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకు ల జగన్**



జగద్గిరిగుట్ట , ప్రజాస్ఫూర్తి : నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘసభ్యులు బస్తీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకు ల జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పాపిరెడ్డి నగర్(ఏ)బ్లాక్,దేవమ్మబస్తీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా నియమితుయ్యారు. మంగళవారం స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ ను మగ్దుమ్ నగర్ లోని నివాస కార్యాలయం వద్ద అధ్యక్షులు బసవేశ్వర్,ప్రధాన కార్యదర్శి మహేందర్ గౌడ్, కోశాధికారి శ్యామ్ కుమార్ లు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఓరుగంటి కృష్ణ గౌడ్ ను కలిశారు.ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్,సభ్యులు రాంప్రసాద్,శ్రీను,సతీష్,ప్రవీణ్ కుమార్,మొవ్వా రవి కిరణ్,తదితరులు పాల్గొన్నారు.



## కాలనీ తొంబై శాతం పైనే అభివృద్ధి పనులన్నీ పూర్తి చేశాం

*** శివమ్మా కాలనీ సమస్యలపై పాదయాత్ర చేసిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : కాలనీ తొంబై శాతం పైనే అభివృద్ధి పనులన్నీ పూర్తయ్యాయని, మిగిలిన ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని శివమ్మా కాలనీ లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనుల పై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులు , కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ నగర్ కాలనీలో కొంతమేర డ్రైనేజీ , సీసీ రోడ్లకు సంబందించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి , సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంక్షన్ చేయించి అతి త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. కొత్తమేర పెండింగ్ లో ఉన్న పనులను త్వరలో పూర్తి చేస్తామని తెలియచేసారు. డ్రైనేజీ మ్యాన్ హోల్ లోపల ప్లాస్టిగ్ లేక నిరంతరం పుడుకుపోయి జామ్ అవుతున్న సమస్యను కాలనీ వాసులు కార్పొరేటర్గా దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా మ్యాన్ హోల్స్ అన్నింటికీ లోపలవైపు సిమెంట్ ప్లాస్టింగ్ చేసి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, కె.నరసింహులు, మన్యం, ఆది నారాయణ, గిరి, రాఘవేంద్ర, కృష్ణ, శ్రీను, బి.నరసింహ, రమేష్, సురేష్, సుధాకర్, సత్తయ్య, రమేష్, రవీందర్, జి.ఎచ్.ఎమ్.సి అధికారులు ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, యుబీడి నాగరాణి, ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, వాటర్ వర్క్స్ సూపర్వైజర్ శివ, ఎస్.ఎఫ్.ఎ వెంకటరెడ్డి & మల్లేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వలిగొండ గ్రామపంచాయతీ కార్యదర్శి, చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రానికి చెందిన చింతల బాబు ఉత్తమ గ్రామపంచాయతీ కార్యదర్శిగా సేవ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో అభ్యుదయ యూత్ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీత చింతల బాబును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో అభ్యుదయ యూత్ అసోసియేషన్ సభ్యుడైన చింతల బాబు వలిగొండలో గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఉత్తమంగా విధులు నిర్వహిస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవ ప్రశంసా పత్రాన్ని వారికి ఇవ్వడం చాలా ఆనందాన్ని కలిగించిందని అన్నారు. మునుముందు ప్రభుత్వ అధికారిగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ వారిని ఘనంగా సన్మానించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా చింతల బాబు మాట్లాడుతూ.. చౌటుప్పల్ మేజర్ గ్రామపంచాయతీలో 13సంవత్సరాలు సభార్డినేటర్ గా పని చేయడంతో ప్రమోషన్ గా వలిగొండ గ్రామపంచాయతీకి బిల్ కలెక్టర్ గా సేవలందించానని, ఆ తదుపరి చౌటుప్పల్ మండలం గుండ్లబావి గ్రామపంచాయతీకి మొట్టమొదటిసారిగా గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించానని తెలిపారు. అనంతరం వలిగొండ గ్రామపంచాయతీకి కార్యదర్శిగా మూడు సంవత్సరముల నుంచి విధులు నిర్వహిస్తున్న క్రమంలో తన విధులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ కార్యదర్శిగా సేవ ప్రశంసాపత్రాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదగా అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో గ్రామపంచాయతీకి మరింత సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ యూత్ గౌరవ అధ్యక్షుడు వర్కాల కుమార్ గౌడ్, అధ్యక్షుడు తొర్పునూరి బాబు, గౌరవ సలహాదారులు మొగుదాల రాములు గౌడ్, చెవగోని వెంకటేష్ గౌడ్, చెరుకు అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తొర్పునూరి రవి, సభ్యులు తొర్పునూరి మల్లేష్, మార్గం నర్సింహ్మా, ఎర్రసాని శ్రీనివాస్ యాదవ్, బొమ్మిరెడ్డి జీవన్ రెడ్డి, మొగుదాల రాకేష్, తొర్పునూరి సాయి తదితరులు పాల్గొన్నారు.



## క్రమశిక్షణతో కూడిన ప్రవర్తనలను కూడా పెంపొందించటం

## ప్రజా ప్రతినిధులు ,విద్యావేత్తల ఉమ్మడి బాధ్యత



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : 77వ రిపబ్లిక్ డే ను పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సౌజన్యంతో 240 హై స్కూల్స్ కు, వన్లైన్ సాఫ్ట్వేర్ బుక్ లను అందజేశారు. మంగళవారం నియోజకవర్గంలోని పలు పాఠశాలలో ఆయా పాఠశాలల కరస్పాండెట్స్ ఆ బుక్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో కంప్యూటింగ్, అనలిటికల్, ప్రాబ్లమ్ సాల్వింగ్ , జాబ్ రెడీనెస్ స్కిల్స్ పెంపొందిచటం జరుగుతుందన్నారు. విద్యార్థులను అకాడెమిక్స్ లోనే బలోపేతం చేయటానికి పరిమితం కాకుండా, భవిష్యత్తు ఉపాధి కోసం సిద్ధం చేయడం, ఆత్మవిశ్వాసంతో ఆలోచించడం జరుగుతుందన్నారు. క్రమశిక్షణతో కూడిన ప్రవర్తనలను కూడా పెంపొందించటం అనేవి ప్రజా ప్రతినిధులు ,విద్యావేత్తల ఉమ్మడి బాధ్యత అని అన్నారు. ఈ భాగస్వామ్య దృక్పథంతో, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ రెండు దశాబ్దాలకు పైగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పాఠశాలలు , ఉపాధ్యాయులతో వివిధ విద్యా కార్యక్రమాలలో చురుకుగా పనిచేస్తున్నారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా, అనేక విద్యార్థి ఉపాధ్యాయ కేంద్రీకృత కార్యక్రమాలను సంయుక్తంగా నిర్వహించారన్నారు. దాదాపు 300 పాఠశాలల్లో నీటి కథల వక్తృత్వ పోటీలు, వ్యక్తీకరణ , గ్రహణశక్తిని పెంపొందించడానికి 150 కి పైగా ఉన్నత పాఠశాలల్లో స్పీక్ఎబుక్ పోటీలు , విద్యార్థులలో సెల్ఫ్ ప్రొఫైలింగ్ , సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఉపాధ్యాయ దినోత్సవం నాడు 650 "5ఈ ఛాంపియన్ ప్రొఫైల్" పోస్టర్ల పంపిణీ చేశారన్నారు. ఎమ్మెల్యే నిరంతర ప్రయత్నంలో భాగంగా, పాఠశాలలను జాబ్ రెడీనెస్ స్కిల్స్ కు అనుసంధానించడానికి, ఇటీవల విడుదలైన వన్లైన్ సాఫ్ట్వేర్ బుక్ ను, రిపబ్లిక్ డే సందర్భంగా, 240 ఉన్నత పాఠశాలలకు బహుకరించారని తెలిపారు. ఈ పుస్తకాన్ని 31 సంవత్సరాలకు పైగా సాఫ్ట్వేర్ పరిశ్రమలో అనుభవం ఉన్న సీనియర్ సాఫ్ట్వేర్ ప్రొఫెషనల్ , 5ఈ ఎంపవర్మెంట్ మోడల్ (ఎడ్యుకేషన్, ఎంప్లాయబిలిటీ, ఎఫీషియన్సీ, ఎంపతీ, ఎథిక్స్) ఫౌండర్ కెసిపెద్ది నరసింహరాజు రచించారన్నారు. ఈ పుస్తకం ముఖ్యంగా ఉన్నత పాఠశాల స్థాయిలో విద్యార్థులకు కంప్యూటింగ్ స్కిల్స్ సాఫ్ట్వేర్ బేసిక్స్ ను సరళమైన పద్ధతిలో పరిచయం చేయడానికి ఆలోచనాత్మకంగా డిజైన్ చేయబడిందన్నారు. ఈ బుక్ ద్వారా, విద్యార్థులు కోడింగ్ స్కిల్స్ కు సులభంగా పరిచయం చేయబడతారు, అదే సమయంలో వారి అనలిటికల్ మరియు ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ బలోపేతం అవుతాయన్నారు. ఈ ప్రోగ్రాం ను ముందుకు తీసుకెళ్ళటానికి గణిత ఉపాధ్యాయుల కోసం ఒక రోజు వర్క్ షాప్ ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో క్యూఎంఆర్ఎస్ఎ చైర్మన్ , యూనిక్ స్కూల్ కరస్పాండెంట్ శివయ్య, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు , చైతన్య విద్యానికేతన్ స్కూల్ చైర్మన్ డాక్టర్ శివరాత్రి యాదగిరి, యూనిక్ హైస్కూల్ ప్రిన్సిపాల్ నాగ భూషణం, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు , చైతన్య విద్యానికేతన్ స్కూల్ చైర్మన్ డాక్టర్ శివరాత్రి యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డానియల్ రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ మదర్, మేడ్చల్ జిల్లా ప్రెస్ మా ఉపాధ్యక్షులు డాక్టర్ సతీష్, చీఫ్ అడ్వైజర్ అల్తాఫ్, ఉప్పల్ మాజీ అధ్యక్షులు ఉప్పల్ ధన్ సాగర్, సభ్యులు నితేంద్ర మిశ్ర తదితరులు పాల్గొన్నారు

## నాలాపై కప్పులను తొలగించి వర్షపు నీరు, డ్రైనేజీ నీరు పోయేలా చర్యలు తీసుకోవాలి

*** పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్**



జీడిమెట్ల,(ప్రజాస్ఫూర్తి) : జిహెచ్ఎంసి అధికారులు నిర్మించినటువంటి నాలా పై కప్పులను తొలగించి వర్షపు నీరు, డ్రైనేజీ నీరు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త, పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం ఆయన సూరారం కాలనీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారులు గత సంవత్సరం ఓపెన్ నాలా నిర్మించారన్నారు. ఆ ఓపెన్ నాలా ద్వారా వచ్చిన వర్షపునీరు గాని డ్రైనేజీ నీరు వెళ్ళేలా కానీ స్థానిక ము గా యున్న ఇండ్ల యజమానులు అట్టి ఓపెన్ నాలను మూసివేయడంతో నీరు రోడ్డు మీద వరదలై పారుతుందన్నారు. రాకపోకలు సాగించే ప్రజలకు పాదచారులకు, స్కూల్ పిల్లలకు చాలా ఇబ్బందిగా ఉందని అన్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు నిర్మించినటువంటి నాలా పై కప్పులను తొలగించి వర్షపు నీరు, డ్రైనేజీ నీరు ఓపెన్ నాలో పోయే విధంగా చేయాలని ప్రజలు జిహెచ్ఎంసి డిమాండ్ చేస్తున్నారన్నారు. జీహెచ్ఎంసీ వారు నిర్మాణం చేసిన ఓపెన్ నాలా ఉన్నది, ఆ ఓపెన్ నాలా ద్వారా వచ్చిన వర్షపునీరు గాని డ్రైనేజీ నగర్ వెళ్ళేది కానీ స్థానికము గా యున్న ఇండ్ల యజమానులు అట్టి ఓపెన్ నాలాను మూసివేయడంతో నీరు రోడ్డు మీద వరదలై పారుతుందని, వచ్చిపోయే వారికి ప్రజలకు పాదచారులకు, స్కూల్ పిల్లలకు చాలా ఇబ్బందిగా ఉందని ప్రజలు ఆవేదన చెందు తున్నారు స్కూల్ పిల్లల డ్రెస్ ల మీద పడి డ్రెస్సులు కూడా పాడైన సందర్భాలు ఉన్నాయి ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు నిర్మించినటువంటి నాలా పై కప్పులను తొలగించి వర్షపు నీరు డ్రైనేజీ నీరు ఓపెన్ నాలో పోయే విధంగా చేయాలని, , స్థానిక ప్రజలు జిహెచ్ఎంసి అధికారులను డిమాండ్ చేస్తున్నారన్నారు.

# విశ్రాంత ఐపీఎస్ భార్యను మోసగించిన కేసులో నలుగురి అరెస్ట్

హైదరాబాద్: నగరానికి చెందిన విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్యను స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో మోసగించిన కేసులో నలుగురు అంతర్రాష్ట్ర నిందితులను నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మయన్మార్ కేంద్రంగా మోసానికి పాల్పడినట్టు గుర్తించారు. బిహార్, పశ్చిమబెంగాల్‌కు చెందిన నలుగురు మ్యూల్ ఖాతాలు సమకూర్చినట్టు నిర్ధారించారు. ట్రాన్సిట్ వారెంట్‌పై నిందితులను నగరానికి తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. మాయగాళ్లు కాజేసిన సొమ్ములో రూ.45 లక్షలు ఫ్రీజ్ చేశారు. బంజారాహిల్స్‌లో ఉంటున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య వాట్సాప్ నంబరుకు గతేడాది నవంబరులో షేర్‌మార్కెట్ లింక్ వచ్చింది. తమ సంస్థలో పెట్టుబడితో 500 రెట్లు లాభం వస్తుందని ఆశచూపారు. ఆమెకు ట్రేడింగ్‌పై అవగాహన లేకపోవటంతో భర్త సహాయం తీసుకున్నారు. స్టాక్‌మార్కెట్ ప్రాఫిట్ గైడ్ ఎక్స్ఛేంజ్ గ్రూప్ 20లో సభ్యత్వం ఇచ్చారు.



మార్కెట్ నిపుణులుగా నమ్మిస్తూ డిసెంబరు 24 నుంచి ఈ నెల 5 వరకు 19 సార్లు రూ.2.58 కోట్లు పెట్టుబడి పెట్టించారు. రూ.2 కోట్లు లాభం వచ్చినట్టు డిజిటల్ ఖాతాలో చూపుతూ నమ్మకం కలిగించారు. ఆ డబ్బు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఇవ్వకుండా మరికొంత సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. మోసపోయినట్టు గ్రహించిన బాధితురాలు ఈ నెల 5న 1930 నంబరు ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు.




## మేడారం పయనమైన పగిడిద్దరాజు

గంగారం: మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామంలో కొలువైన వనదేవత సమ్మక్క భర్త పగిడిద్దరాజు అంగరంగ వైభవంగా ముస్తాబై మేడారం మహాజాతరకు పయనమయ్యారు. మంగళవారం వేకువజామునే గ్రామంలోని పగిడిద్దరాజు ఆలయాన్ని పూజారులు పెనుక రాజేశ్వర్ ఆధ్వర్యంలో శుద్ధి చేసి మామిడి తోరణాలతో అలంకరించగా ఆడపడుచులు గుడి ప్రాంగణంలో ముగ్గులు వేశారు. అనంతరం గ్రామంలోని పెనుక వెంకటేశ్వర్లు ఇంటి నుంచి పాన్పు రూపంలో ఉన్న పగిడిద్దరాజును శివసత్తుల పూనకాలు, డోలువాయిద్యాలు మధ్య ఊరేగింపుతో పగిడిద్దరాజు ఆలయానికి తలపతులైన పెనుక వంశీయులు తీసుకొచ్చారు. ఆలయంలో పగిడిద్దరాజుకు సంబంధించిన మువ్వలు, గంటలు, గజ్జెలను శుభ్రపరిచిన పూజారులు దూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆదివాసీల సంప్రదాయ రీతిలో రహస్య పూజలు నిర్వహించారు. అనంతరం పగిడిద్దరాజును పడగ రూపంలో పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి ఊరేగింపుగా అడవి మార్గంలో సుమారు 62 కి.మీ., దూరంలోని మేడారానికి కాలినడకన తీసుకెళ్లారు. మంగళవారం రాత్రి ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్ష్మీపురంలో బస చేయనున్నారు. బుధవారం సాయంత్రం వరకు మేడారం చేరుకొని పడగ రూపంలోని పగిడిద్దరాజును గద్దెపై ప్రతిష్ఠించనున్నారు. పూజారులు పెనుక రాజేశ్వర్, సురేందర్, సమ్మయ్య, రామస్వామి, పురుషోత్తం, రాహుల్ తదితరులు కాలినడకన మేడారం వెళ్లారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి: రామచందర్‌రావు

హైదరాబాద్: ఉద్యోగుల ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ ఏర్పాటైతే ఉద్యోగాలు వస్తాయని పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ఉద్యోగాల భర్తీ దేవుడెరుగు.. ఉన్నవారికి పీఆర్సీ, ఇతర అంశాలు ఇవ్వడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలను చెల్లించడం లేదు. దీనికి గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరే కారణం. ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం దారుణం. ఎంతో మంది రిటైర్డ్ ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. నిరుద్యోగులకు రూ.4వేల భృతి ఏమైంది? ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వలేకపోతున్నారు కానీ.. ఓయూ అభివృద్ధికి రూ.1000 కోట్లు ఇస్తామని ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించేవరకు భాజపా పోరాటం కొనసాగుతుంది.




మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలి" అని రామచందర్‌రావు అన్నారు.

## టీచర్లు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి

**: మంత్రి కోమటిరెడ్డి**

నల్గొండ: సరైన విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. నల్గొండలోని బొట్టుగూడలో అత్యాధునిక వసతులతో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను ఆయన ప్రారంభించారు. రూ.8కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి




తీసుకొచ్చామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడినా తొలి పదేళ్లలో మన సమస్యలు తీరలేదని మంత్రి అన్నారు. ప్రతి నియోజకవర్గంలో దాదాపు రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని.. కులమతాలకు అతీతంగా విద్యార్థులు చదువుకోవాలన్నది తమ ప్రభుత్వ ఆశయమని చెప్పారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను సర్కారు పాఠశాలల్లో చదివించి మార్పు తీసుకురావాలని ఈ సందర్భంగా కోమటిరెడ్డి సూచించారు.

## రాజేంద్రనగర్ వద్ద ఔటర్ రింగ్‌రోడ్డుపై కారు దగ్ధం

హైదరాబాద్: రాజేంద్రనగర్ పోలీస్ అకాడమీ సమీపంలో ఔటర్ రింగు రోడ్డుపై ఓ కారు దగ్ధమైంది. తుక్కుగూడ నుంచి నితిన్ కారులో నార్సింగి వైపు వస్తుండగా.. మంచిరేవుల వ్యాస్‌నగర్ సమీపంలోకి రాగానే కాళ్ల వద్ద వేడి తగిలింది. అప్రమత్తమైన ఆయన.. కారును పక్కకు నిలిపి దిగిపోయాడు. క్షణాల్లో కారు మొత్తం మంటలు అంటుకొని దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.



## ఏబీఎన్‌పై చర్యలు తీసుకోవాలి – శాసనమండలి చైర్మెన్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్సీలు

ఏబీఎన్లో ఇటీవల జరిగిన ఒక డిబేట్‌లో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ను అవమానించిన ఘటనలో తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీలు కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీని చానల్‌లో చర్చకు పిలిచి అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. చర్చలో వ్యాఖ్యాత బీఆర్ఎస్‌పై కుట్రతో వ్యవహరించడంతో దానిని అడ్డుకునేందుకు తక్కళ్లపల్లి ప్రయత్నించారని గుర్తు చేశారు. తమ నేతలపై బురదజల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. దీనిని ఆయనపై జరిగిన దాడిగా కాకుండా శాసనమండలి సభ్యులపై జరిగిన దాడిగా భావించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరారు. మొదటినుంచీ ఏబీఎన్ చానల్ తెలంగాణ వ్యతిరేకతను ప్రదర్శిస్తోందని




ఆరోపించారు. ఉద్యమానికి నష్టం చేసేలా కేసీఆర్‌పై విషప్రచారం చేస్తూ పత్రికా నిబంధనలు కూడా ఉల్లంఘించారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, విప్ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎల్ రమణ, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పులుల గణన సర్వే విజయవంతం



హైదరాబాద్: తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో పులుల గణన సర్వే విజయవంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా జనవరి 19 నుంచి 25 వరకు ఆరు రోజులపాటు శాస్త్రీయ పద్ధతుల్లో అటవీ శాఖ అధికారులు ఈ సర్వే చేపట్టారు. సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో ములుగు జిల్లా మినహాయించి.. మిగతా 32 జిల్లాల్లో సర్వే పూర్తి చేసినట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. రోజుకు రెండు కిలోమీటర్ల ట్రాన్సెక్ట్ సర్వే నిర్వహించి అటవీ వృక్షజాలం, ఆహార జంతువుల సాంద్రతపై అటవీశాఖ అంచనా వేసింది. క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారాన్ని MSTRIPES యాప్‌లో నమోదు చేసి వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా రిమోట్ సర్వర్‌లో అప్‌లోడ్ చేశారు. ప్రాథమిక గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పులులు, ఇతర మాంసాహార జంతువుల ఉనికికి సంబంధించి 994 ఆధారాలు లభ్యమయ్యాయి. 552 పెద్ద శాకాహార జంతువులకు సంబంధించిన ఆధారాలు గుర్తించారు. ఇతర వన్యప్రాణుల ఆనవాళ్లు కూడా పెద్ద సంఖ్యలో లభ్యమైనట్టు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ సర్వేలో 4,512 మంది అటవీ శాఖ సిబ్బందితో పాటు దేశ నలుమూలల నుంచి వచ్చిన 1,677 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

## సంతోష్ కుమార్ వల్లే గద్దర్ ప్రజాభవన్ గేట్ బయట ఉండాల్సి వచ్చింది..

*** కవిత సంచలన వ్యాఖ్యలు**

ఫోన్‌ట్యాపింగ్ కేసులో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌కుమార్ సిట్ విచారణకు హాజరుకానున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోని సిట్ కార్యాలయంలో అధికారులు ఆయనను ప్రశ్నించనున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ, తన సోదరుడు సంతోష్‌కుమార్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి సంతోష్‌కుమార్ గూఢచారి



అని ఆరోపించారు. ఉద్యమనేతను (కేసీఆర్) ఉద్యమకారులకు దూరం చేసిందే ఆయనని మండిపడ్డారు. ప్రజా గాయకుడు గద్దర్ లాంటి వాళ్లు ప్రగతిభవన్ గేటు బయట ఉండాల్సి వచ్చిందే సంతోష్ వల్లనని ధ్వజమెత్తారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయనకు శిక్ష పడుతుందనే నమ్మకం తనకు లేదని చెప్పారు. సిట్ పిలవడం సరే కానీ.. ఏం శిక్షలు పడతాయో చూడాలని తెలిపారు. కామారెడ్డిలో డ్రగ్స్ గ్యాంగ్ చేతిలో తీవ్రంగా గాయపడి, నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆబ్కారీ కానిస్టేబుల్ సౌమ్యను కవిత పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంతోష్ కుమార్ ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, సొంతపార్టీ ఏర్పాటు దిశగా కవిత వేగంగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా మార్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఇప్పటికే దరఖాస్తు చేసినట్లు తెలుస్తున్నది. జాగృతి ప్రతినిధులు ఢిల్లీకి వెళ్లి దరఖాస్తును సమర్పించినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం.. మూడు నెలల్లో తెలంగాణ జాగృతికి రాజకీయ పార్టీగా గుర్తింపు దక్కే అవకాశముందని జాగృతి శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. అనుకున్నట్లుగా 3 నెలల్లో గుర్తింపు దక్కితే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఆ పార్టీ బరిలోకి దిగే అవకాశం ఉంది. దీనికి అనుగుణంగా కవిత ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

## స్టైఫండ్, బకాయిల జాప్యంపై తెలంగాణ మెడికోల ఆందోళన

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా ఆసుపత్రుల్లో పని చేస్తున్న జూనియర్ డాక్టర్లకు సంబంధించిన జనవరి 2025 నుంచి జూన్ వరకు చెల్లించాల్సిన స్టైఫండ్, బకాయిల విడుదలలో జాప్యం జరుగుతోందని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ, సంబంధిత బిల్లులు అన్ని విధివిధానాలు పూర్తి చేసి శాఖ స్థాయిలో ఆమోదం పొందినప్పటికీ, ప్రభుత్వ తుది అనుమతులు లేకపోవడంతో ఇప్పటి వరకు చెల్లింపులు జరగలేదని పేర్కొంది. ప్రభుత్వ ఆరోగ్య సేవల వ్యవస్థలో జూనియర్ డాక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, బోధనా ఆసుపత్రుల్లో నిరంతరం కఠిన పరిస్థితుల్లో సేవలందిస్తున్న సమయంలో వారికి రావాల్సిన న్యాయమైన చెల్లింపులు ఆలస్యం కావడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపింది. ఈ జాప్యంతో మానసిక స్థైర్యం, అకడమిక్ కార్యకలాపాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని వెల్లడించింది. జూన్ 2025 నుంచి ఇప్పటి వరకు పలుమార్లు ప్రభుత్వానికి వినతులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ ఆలస్యం కొనసాగితే 2021 బ్యాచ్ పీజీ డాక్టర్లు (ప్రస్తుతం సీనియర్ రెసిడెంట్లు), 2022 బ్యాచ్ పీజీ డాక్టర్లు, హౌస్ సర్జన్లు, సూపర్ స్పెషాలిటీ పీజీ డాక్టర్లకు రావాల్సిన బకాయిలపై అనిశ్చితి ఏర్పడుతుందని హెచ్చరించింది. జనవరి-జూన్ 2025 కాలానికి సంబంధించిన అన్ని పెండింగ్ బిల్లులకు తక్షణమే ప్రభుత్వ ఆమోదం ఇచ్చి,



బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

# యాసిడ్ దాడులు.. నిందితుల ఆస్తులను ఎందుకు వేలం వేయకూడదు?: సుప్రీం కోర్టు

యాసిడ్ దాడుల కేసుల్లో నిందితుల ఆస్తులను వేలం వేసి బాధితులకు పరిహారంగా ఎందుకు ఇవ్వకూడదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. జీవితాంతం చికిత్స, పునరావాసం కోసం ప్రస్తుతం బాధితులకు అందజేస్తున్న పరిహారం (కనీసం రూ.3 లక్షలు) సరిపోదని పేర్కొంది. ఈ విషయంలో మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ దారుణమైన నేరాలను నివారించేందుకు అసాధారణమైన శిక్షలు అవసరమని, ఈ దిశగా చట్టంలో మార్పులు చేయాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సూచన చేశారు. యాసిడ్ దాడి బాధితురాలు షాహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం విచారించింది. బలవంతంగా యాసిడ్ తాగించిన ఘటనల్లో బాధితులకు తగిన పరిహారం, వైద్య సంరక్షణ సహా ఇతర ఉపశమనాలు లభించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తనపై జరిగిన యాసిడ్ దాడి



కేసులో ఇప్పటికే 16 ఏళ్లు పోరాడానని, కానీ.. ట్రయల్ కోర్టులో నిందితులందరూ నిర్దోషులుగా విడుదలయ్యారని ఆమె ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో పోరాడుతూ తన జీవితంలో విలువైన కాలాన్ని కోల్పోయానని చెప్పారు. అయితే.. బాధితురాలి తరపున హైకోర్టులో మంచి న్యాయవాది ఈ కేసును వాదించేలా సర్వోన్నత న్యాయస్థానం చర్యలు తీసుకుంటుందని సీజేఐ హామీ ఇచ్చారు. ఏడాది వారీగా యాసిడ్ దాడుల కేసులు, కోర్టుల్లో వాటి ప్రస్తుత స్థితి, బాధితుల కోసం చేపట్టిన పునరావాస కార్యక్రమాల వంటి వివరాలను అందజేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు ఆదేశించింది. బాధితులతో బలవంతంగా యాసిడ్ తాగించిన కేసుల వివరాలను కూడా అందించాలని చెప్పింది. బాధితుల విద్యార్హత, ఉద్యోగం, వైవాహిక స్థితి, వైద్య చికిత్స, దానికి అయిన లేదా అయ్యే ఖర్చుల వివరాలను కూడా సమర్పించాలని తెలిపింది. నాలుగు వారాల్లోగా వివరాలను అందజేయాలని ఆదేశించింది.

## పోరాడి ఓడిన స్వాతంత్ర్య యోధుడు.. ఆ కల నెరవేరకుండానే కన్నుమూత

ఛత్తర్‌పూర్: స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని దేశ దాస్యశృంఖలాలను తెంచడంలో తనవంతు పాత్ర పోషించారు. కానీ, స్వాతంత్ర్య పోరాట యోధుడిగా గుర్తింపు సాధించడంలో ప్రభుత్వంతో జరిపిన పోరులో మాత్రం ఓడిపోయారు. చివరకు కల నెరవేరకుండానే 102 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. ఆయనే మధ్యప్రదేశ్‌లోని ఛత్తర్‌పూర్‌కు చెందిన రాజేంద్ర మహతో. "నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో మా నాన్న స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. ప్రజామండల్ ఉద్యమం ద్వారా పోరాటాలు చేశారు. ఛత్తర్‌పూర్, చర్ఖారీ సంస్థానాలకు ఎదురొడ్డి నిలిచారు. గాంధీ పిలుపునిచ్చిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని, జైలుకూ వెళ్లారు. ఓ సారి బిజావర్ జైల్లో స్థలం లేకపోవడంతో.. ఆయన్ను అడవుల్లో విడిచిపెట్టారు. మూడు రోజులు ఆకలిదప్పులు తట్టుకొని తిరిగి వచ్చి మళ్లీ పోరాటం చేశారు" అని రాజేంద్ర కుమారుడు ఉమాకాంత్ నాటి




విషయాలను గుర్తుచేసుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడి గుర్తింపు కోసం మొదటి నుంచి చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడంతో.. ఏడేళ్ల క్రితం మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. గతేడాది న్యాయస్థానం ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో ముఖ్యమంత్రికి, సీనియర్ అధికారులకు దరఖాస్తులు సమర్పించారు. అయితే, ఆ కల నెరవేరకుండానే ఇటీవల ఆయన కన్నుమూశారు.

## 'వీబీ జీ రామ్ జీ'పై.. రివర్స్ గేర్ వేయలేం: కిరణ్ రిజిజు

బడ్జెట్ సమావేశాల్లో 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై చర్చ జరగాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రివర్స్ గేర్ వేసి.. గతంలోకి వెళ్లలేమని, అది అసాధ్యమని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఏదైనా ఒక్కసారి చట్టరూపం దాల్చాక దానిని పాటించాల్సిందేనన్నారు. ఈ



నెల 28 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రం మంగళవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ భేటీకి అధ్యక్షత వహించారు. ఆయా అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సమావేశం అనంతరం కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. అయితే, బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో.. సంబంధిత అంశాలపై చర్చలు జరపడమనేది నియమమని చెప్పారు. మోదీ ప్రభుత్వం ఎప్పుడూ నియమాలు, నిబంధనలను ఉల్లంఘించలేదన్నారు. రాజ్యాంగం ప్రకారం నడచుకుంటామని చెప్పారు. ఎంపీలంతా ప్రజాసమస్యలను లేవనెత్తేందుకే ఎన్నికయ్యారని, వారికి భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుందని, కానీ.. ఇతర సభ్యులు చెప్పేది వినడం కూడా బాధ్యతేనని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం సమావేశాల అజెండా పంచుకుంటామని చెప్పారు.




## ఆస్ట్రేలియా తరహాలో.. గోవాలో పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ చేయనున్నారా?

చిన్నారులు సామాజిక మాధ్యమాల వినియోగంపై ఆస్ట్రేలియా అమలు చేస్తున్న నిషేధాన్ని అనేక దేశాలు ఆసక్తిగా గమనిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌లోని కొన్ని రాష్ట్రాలు కూడా ఈ చట్టాన్ని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా గోవా కూడా చిన్నారులకు సోషల్ మీడియాను యాక్సెస్ చేసుకోకుండా ఎలా నియంత్రించాలన్న అంశాన్ని పరిశీలిస్తోంది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర మంత్రి వెల్లడించారు. 16 ఏళ్ల లోపు చిన్నారులు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా ఆస్ట్రేలియా తీసుకొచ్చిన చట్టాన్ని అధ్యయనం చేస్తున్నామని గోవా ఇన్ఫోటెక్ మంత్రి రోహన్ ఖౌంటే ఇటీవల వెల్లడించారు. ఇవి చిన్నారులను అవసరమైన విషయాలవైపు దృష్టి మళ్లిస్తున్నాయని.. అనేక దుష్పరిణామాలకు కారణమవుతున్నాయన్నారు. ఏఐ యుగంలో చిన్నారులు విద్య, సాంకేతికతపై దృష్టి పెట్టేలా చూడటమే తమ ఉద్దేశమన్నారు. ప్రతికూల ప్రభావాలపై తల్లిదండ్రుల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయని, అందుకే.. తమ రాష్ట్రంలోనూ ఆస్ట్రేలియా చట్టాన్ని తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు గోవా మంత్రి వెల్లడించారు. ఇదే సమయంలో రాష్ట్ర స్థాయిలో ఇటువంటి నిషేధం సాధ్యమా అన్న విషయాన్ని పరిశీలిస్తున్నామని.. ఇప్పటికే ఓ బృందం దీనిపై అధ్యయనం చేస్తోందన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాలకు ముందే దీనిపై ప్రభుత్వం నుంచి ఓ ప్రకటన వచ్చే అవకాశం ఉందన్నారు.

## సోషల్ మీడియాలో వైరల్‌గా గూగుల్ ఉద్యోగి పోస్ట్.. నెటిజన్ల ప్రశంసలు

టైర్3 కళాశాల (మారుమూల ప్రాంతంలోని కాలేజీ)లో ఎన్నో సమస్యల మధ్య చదువుకున్న తాను పట్టుదలతో ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ (Google)లో ఉద్యోగం సంపాదించినట్లు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చేసిన పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన వృత్తిపరమైన ప్రయాణాన్ని వివరిస్తూ.. మధ్యప్రదేశ్ భోపాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆర్చీ గుప్తా ఇన్‌స్టాలో పలు ఫొటోలు షేర్ చేసింది. అందులో ఆమె మారుమూల ప్రాంతంలోని సాధారణ కాలేజీలో చదివిన తనకు.. వృత్తి జీవితంలో ఎదురైన సవాళ్లు, తిరస్కరణలను వివరించింది. మనం పుట్టిన స్థానం, పెరిగిన వాతావరణం వంటివి మన అభివృద్ధిని ఆపలేవని పేర్కొంది. కఠిన పరిస్థితుల్లోనూ పట్టుదలతో ప్రయత్నిస్తే విజయాన్ని సాధించగలమని తెలిపింది. భోపాల్‌లోని ఓ మారుమూల ప్రాంతంలో ఉన్న టైర్3 కళాశాలలో ఆర్చీ గుప్తా 2017లో డిగ్రీ పట్టా పొందింది. చిన్న కాలేజీ కావడంతో సాధారణ టెక్ కంపెనీలు ప్లేస్‌మెంట్లను నిర్వహించాయి. గూగుల్‌లో ఉద్యోగం సంపాదించడం తన కల అయినప్పటికీ ఆమె మొదట ఓ చిన్న సంస్థలో ఉద్యోగంలో




చేరింది. అక్కడ ప్రోగ్రామింగ్, కోడింగ్ వంటి వాటిలో నైపుణ్యాలను మెరుగుపరుచుకుంది. అనంతరం మరో టెక్ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేసింది. 2019లో గూగుల్ ఇంటర్వ్యూలో రిజక్ట్ అయ్యింది. తిరస్కరణకు గురైనందుకు నిరుత్సాహపడకుండా తన నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకుంది. 2022లో గూగుల్‌లో ఉద్యోగం వచ్చింది. ఆ సంస్థలో ఉద్యోగానికి ఎంపిక అయినట్లు మెయిల్ చూడగానే అన్ని రోజులు పడిన ఇబ్బందులు మర్చిపోయానని ఆమె పేర్కొంది. వృత్తి జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను సమస్యలుగా చూడకుండా.. వాటిని అధిగమించడానికి నిరంతరం పట్టుదలతో ప్రయత్నించాలని యువతకు సూచించింది. ప్రముఖ కాలేజీలు, ఐఐటీల్లో చదవకపోయినా కచ్చితమైన లక్ష్యంతో ముందుకు వెళ్తే... కచ్చితంగా విజయం సాధించగలమని తెలిపింది. ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఆమెను అభినందిస్తున్నారు.




## సెంట్రల్ ఆసియా దేశాలకు.. ఫిబ్రవరి 11 వరకు ఇండిగో విమాన సర్వీసులు రద్దు

ఇరాన్‌లో ఉద్రిక్తతలతో.. సెంట్రల్ ఆసియాకు మరిన్ని విమానాలను రద్దు చేస్తున్నట్లు ఇండిగో ప్రకటించింది. టిబిలిసి (జార్జియా), అల్మాటీ (కజక్‌స్థాన్), బాకు (అజర్‌బైజాన్), తాష్కెంట్ (ఉజ్బెకిస్థాన్) నగరాలకు విమాన సర్వీసులను ఫిబ్రవరి 11 వరకు రద్దు చేసినట్లు ఇండిగో వెల్లడించింది. సాధారణంగా ఈ విమాన సర్వీసులు ఇరాన్ గగనతలం మీదుగా ప్రయాణిస్తాయి. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని.. కానీ, ప్రయాణికులు, సిబ్బంది భద్రతే ప్రథమ ప్రాధాన్యమని 'ఎక్స్' వేదికగా ఇండిగో పేర్కొంది.

## ప్రధాని మోదీ ఎక్స్ పోస్ట్‌ను వక్రీకరించిన గ్రోక్

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విటర్) ఏఐ టూల్ గ్రోక్ పై తాజాగా వివాదం చెలరేగింది. రిపబ్లిక్ డే సందర్భంగా మాల్దీవుల నుంచి వచ్చిన శుభాకాంక్షలకు ప్రధాని మోదీ ఇచ్చిన రిప్లై పోస్టు అర్థాన్నే గ్రోక్ మార్చేసింది. దౌత్యపరమైన సందేశాన్ని వక్రీకరించింది . జాతీయ మీడియా కథనాల ప్రకారం.. 77వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు శుభాకాంక్షలు చెప్పారు. దీనిపై మోదీ ధన్యవాదాలు చెప్తూ..ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఇరుదేశాల్లోని ప్రజల ప్రయోజనాల కోసం కలిసి



పనిచేస్తామని రాసుకొచ్చారు. దివేహి (మాల్దీవులు అధికారిక భాష)లో ఆ పోస్టు పెట్టారు. అయితే గ్రోక్ మోదీ సందేశాన్ని పూర్తిగా మార్చేసింది. పూర్తి భిన్నమైన అర్థంలో ఆంగ్లంలోకి అనువాదం చేసింది. "మాల్దీవుల్లో భారత 77వ స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. అందులో మాల్దీవుల ప్రభుత్వం పాల్గొంది. ఈ ప్రభుత్వం భారత వ్యతిరేక ప్రచారాల్లో పాల్గొంది" అని ఇరుదేశాల సంబంధాలను దెబ్బతీసేలా అనువదించింది. గణతంత్ర దినోత్సవం పదం స్థానంలో స్వాతంత్ర్య దినోత్సవంగా ట్రాన్స్‌లేట్ చేసింది. ఇరుదేశాల సంబంధాలను దెబ్బతీసేలా ఉన్న ఈ అనువాదం వివాదాస్పదమవుతోంది. ఏఐ పై పూర్తిగా ఆధారపడితే ప్రమాదం తప్పదని నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐ ఫీచర్లన్నీ ప్రయోగదశలోనే ఉన్నాయని సంబంధిత సంస్థలు చెప్తున్నప్పటికీ.. ఇలాంటి సున్నితమైన అంశాలు సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతుంటాయి. కాగా.. మహిళలు, చిన్నారుల అసభ్య చిత్రాలను గ్రోక్ సృష్టిస్తుందంటూ ఇప్పటికే భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దిద్దుబాటు చర్యలు చేపట్టిన ఎక్స్.. గ్రోక్‌లో ఫొటోలను ఇబ్బందికరంగా మార్చే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.

## అందరికీ అన్నీ తెలియవు.. ప్రధాని మోదీ పరీక్షాపే చర్చ షార్ట్ వీడియో

పరీక్షల సమయంలో విద్యార్థుల్లో భయాందోళన, ఒత్తిడిని పోగొట్టేందుకు ప్రధాని మోదీ 'పరీక్షా పే చర్చ' ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఈ కార్యక్రమానికి సంబంధించిన షార్ట్ వీడియోను మోదీ తన అధికారిక యూట్యూబ్ ఛానెల్‌లో విడుదల చేశారు. ఇందులో పాల్గొనేందుకు 4.5కోట్లకు మందికిపైగా రిజిస్టర్ చేసుకున్నారు. ఈ వీడియోలో మోదీ మాట్లాడుతూ.. 'మీ పద్ధతిని మీరు నమ్మండి. అందరికీ అన్నీ తెలియవు. కానీ ప్రతిఒక్కరికీ ఏదో ఒక విషయంపై అవగాహన ఉంటుంది. పరీక్షలు రాయడం అనేది తప్పనిసరి' అని అన్నారు.

## మేము సూపర్‌పవర్‌గా మారాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిందే : కెనడా మంత్రి

వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఇంధనం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించే దిశగా భారత్‌కెనడా అడుగులు వేస్తున్నాయి. ఇందులోభాగంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న కెనడా ఇంధన మంత్రి టిమ్ హడ్గ్‌సన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా భారత్ అభివృద్ధి చెందుతోందన్నారు. ఇంధన రంగంలో కెనడా సూపర్ పవర్ కావాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను, ఎనర్జీ



ట్రేడ్‌ను మరింత ముందుకుతీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నామన్నారు. చమురు, గ్యాస్ వాణిజ్యాన్ని విస్తరించడానికి ఒట్టావా నుంచి భారత్‌కు ముడి చమురు, పెట్రోలియం, సహజ వాయువులను రవాణా చేయడానికి కెనడా సిద్ధంగా ఉందని టిమ్ హడ్గ్‌సన్ పేర్కొన్నారు. కెనడా మంత్రితో చర్చల అనంతరం భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య పలు వాణిజ్య ఒప్పందాలపై చర్చలు కొనసాగుతోన్నట్లు తెలిపారు. హైడ్రోజన్, బయో ఇంధనాలు, బ్యాటరీ నిల్వ, కీలకమైన ఖనిజాలు, విద్యుత్ వ్యవస్థలు, ఇంధన పరిశ్రమలో కృత్రిమ మేధస్సు వాడకం వంటి విషయాలపై దృష్టిపెట్టామన్నారు. 2050 నాటికి ప్రపంచ ఇంధన డిమాండ్‌లో మన వాటా 30 నుంచి 35 శాతం పెరుగుతుందని.. భారత్ మూడో అతిపెద్ద ఇంధన మార్కెట్‌గా నిలుస్తుందన్నారు.

# ఈ జంతువులు ఇంట్లో పెరుగుతాయి..!



చిట్టి కుందేలు, బుల్లి ఏనుగు, చిన్ని ఎలుగుబంటి... జూలో ఉండాల్సిన జంతువుల జాబితాను చదువుతున్నట్లు ఉంది కదా! కానీ ఇవన్నీ ఇంట్లో మొక్కల్ని పెంచుకునే 'కోకో కాయిర్ ప్లాంటర్ పాట్స్'. ఈ రోజుల్లో ప్రతి వస్తువూ పర్యావరణహితంగా ఉండాలనుకునే ఇంటీరియర్ ప్రేమికులకోసం ప్రత్యేకంగా వీటిని చేతితో తయారుచేస్తున్నారు తయారీదారులు. ముందు లోపల చిన్న మట్టి కుండీని పెడతారు. తర్వాత కొబ్బరి పీచుని కావాల్సిన ఆకృతిలో మలిచి చింతగింజల గ్లూతో అతికించి, సహజ రంగులు వేసి ఈ ఎకో ఫ్రెండ్లీ పాట్స్‌ని తయారుచేస్తారు. ప్లాస్టిక్ పాట్స్‌కి ప్రత్యామ్నాయంగా వీటిని ఇండోర్, బాల్కనీ, కిచెన్ గార్డెన్, ఆఫీస్ డెస్క్‌ల్లోనూ ఉపయోగించుకోవచ్చు. మొక్కలకు నీటిని పోసినప్పుడు టేబుల్‌పై పడకుండా పీల్చుకోవడంతోపాటు మొక్క ఆరోగ్యంగా ఎదిగేందుకు తోడ్పడతాయి. వేర్లకు సహజంగా గాలి సరఫరా అయ్యేలా చేయడంతోపాటు మట్టి తేమను కోల్పోకుండా కాపాడతాయి. మరి ఆత్మీయుల పుట్టినరోజు, పెళ్లిరోజులకు బహుమతిగా ఇచ్చేయండి.







## మీరూ ఇలాంటి అమ్మాయేనా?



**కొంతమంది అమ్మాయిలు తమలో ఆత్మవిశ్వాసం లోపించిందని.. ఫలితంగా తామేమీ సాధించలేకపోతున్నామని.. ఏ పని చేయాలన్నా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందని బాధపడుతుంటారు. అలాంటి వారు ఆత్మవిశ్వాసం మెండుగా ఉండే వారిలో ఎలాంటి లక్షణాలుంటాయో తెలుసుకోగలిగితే.. వారి నుంచి స్ఫూర్తి పొందచ్చని చెబుతున్నారు నిపుణులు.**

**సొంతంగా నిర్ణయాలు..**

అమ్మాయిలు ఏం చదవాలి.. ఎక్కడ చదవాలి.. ఎలాంటి ఉద్యోగం చేయాలి.. మొదలైన అంశాల్లో కొన్ని కుటుంబాల్లో ఇప్పటికీ తుది నిర్ణయం పెద్దలదే అవుతుంటుంది. వారిది చిన్న వయసు కావడం వల్ల వారికేమీ తెలీదనే భావన కూడా ఇందుకు ఓ కారణం కావచ్చు. అయితే ఆత్మవిశ్వాసం ఉన్న అమ్మాయిల్లో తాము ఏం చేయాలో వారే నిర్ణయం తీసుకొనే సామర్థ్యం ఉంటుందట. అలాగని ఇతరుల అభిప్రాయాలకు విలువ ఇవ్వరని కాదు. ఎదుటివారి భావాలను గౌరవిస్తూనే.. తమ వాణిని బలంగా వినిపించే ప్రయత్నం చేస్తుంటారు. అలాగే తాము తీసుకొన్న నిర్ణయం సరైనదేనా? కాదా? అని ఆలోచించుకోవడంతో పాటు.. దానివల్ల జరిగే మంచిచెడులను కచ్చితంగా బేరీజు వేసుకోగలుగుతారు. ఫలితంగా తమ లక్ష్యం వైపు ప్రోత్సహించేలా కుటుంబ సభ్యులు, స్నేహితులనూ వీరు ఒప్పించగలుగుతారని నిపుణులు చెబుతున్నారు.

**'నో' చెప్పడం తెలుసు..!**

ఎవరైనా మనకు ఏదైనా పని అప్పగించినప్పుడు కొన్ని సందర్భాల్లో ఇష్టం లేకపోయినా.. మొహమాటానికి పోయి ఆ పనిని పూర్తి చేయాల్సి వస్తుంది. అలాంటి సందర్భాల్లో మేం ఈ పని చేయలేమని ధైర్యంగా చెప్పలేకపోతాం. కానీ ఆత్మవిశ్వాసం మెండుగా ఉండే ఈ తరం అమ్మాయిలు తమకు నచ్చని పనులు 'చెయ్యం' అని చెప్పడానికి ఏమాత్రం వెనుకాడరట! అలాగే ఆ పనిని తాము ఎందుకు చేయమంటున్నారో దానికి గల కారణాలను సైతం వారు చెప్పడానికి మొహమాటపడరట!

**అసూయ ఉండదు..**

ఇతరులు తమకంటే కొన్ని విషయాల్లో మెరుగ్గా ఉన్నా లేదా వారు చేస్తున్న పనిలో విజయం సాధించినా వారిని చూసి అసూయపడే వారు చాలామందే ఉంటారు. కానీ ఆత్మవిశ్వాసం ఉన్న వారు ఇతరులను చూసి ఇలా అసూయపడరట. తమ పనేదో తాము చూసుకొని ముందుకు సాగుతుంటారే తప్ప.. ఇతరుల గురించి ప్రతిదీ పట్టించుకోవాలన్న ఆసక్తి వారికుండదు. ఫలితంగా తాము చేస్తున్న పని పైనే పూర్తి శ్రద్ధ పెట్టి, సాధించాలనుకొన్న లక్ష్యాల్ని చేరుకోగలుగుతారు. అంతేకాదు.. అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడానికీ వీరు వెనకాడరట. అలాగే ఇతరులను ప్రోత్సహించడంలోనూ వీరు ముందుంటారు అంటున్నారు నిపుణులు. మరి మీరూ అంతేనా?

## మైదాకు బదులుగా ఇవి..!

**మైదా పిండి.. మనం తీసుకునే ఆహారంలో ఎక్కువగా కనిపించే పదార్థం. బ్రెడ్, సమోసాలు, కేకులు, బిస్కట్లు, బోండాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఆహార పదార్థాల్లో మైదా కనిపిస్తుంటుంది. అయితే ఈ పిండిలో శరీరానికి కావాల్సిన పోషకాలు తక్కువ మోతాదులో ఉంటాయి. అలాగే రక్తంలోని చక్కెర స్థాయిలను అమాంతం పెంచేస్తుంది. అయితే రుచిగా ఉంటుందనో, తేలిగ్గా వంట పూర్తవుతుందనో చాలామంది ఈ పిండిని వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో మైదాకు బదులుగా కొన్ని పిండి పదార్థాలను ఆహారంలో చేర్చుకోవచ్చంటున్నారు నిపుణులు. ఫలితంగా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చంటున్నారు.**

**రాగి పిండి**

ఇటీవలి కాలంలో ఆరోగ్యానికి సంబంధించి జాగ్రత్తలు తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది. ఇందులో భాగంగా చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇందులో రాగులు ముందు వరుసలో ఉంటాయి. రాగుల్లో క్యాల్షియం, ఐరన్‌తో పాటు అమైనో అమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి మేలు చేసేవే. రాగి పిండితో రోటీల దగ్గర్నుంచీ లడ్డూల వరకు పలు వంటకాలు చేసుకోవచ్చు. అంతేకాదు.. మైదా పిండి లాగా సాగే గుణం కూడా దీనికి ఉండదు. ఇందులోని క్యాల్షియం ఎముకల దృఢత్వానికి ఉపయోగపడుతుంది. పిల్లల దగ్గర్నుంచీ పెద్దల వరకు ప్రతి ఒక్కరూ నిస్సంకోచంగా రాగి పిండిని తీసుకోవచ్చంటున్నారు నిపుణులు.

**ఓట్స్ పిండి**

బరువు తగ్గాలనుకునే వారు చాలామంది ఓట్స్‌ని ఆహారంలో భాగం చేసుకుంటారు. ఇందులో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. మాంసకృత్తులు, పీచు అధిక మొత్తంలో ఉంటాయి. పీచు వల్ల తిన్న వెంటనే కడుపు నిండిన భావన కలుగుతుంది. అలాగే శరీరానికి కావాల్సిన ఇతర పోషకాలు కూడా ఇందులో








మెండుగా ఉంటాయి. ఈ క్రమంలోనే మైదాకు బదులుగా ఓట్స్ పిండిని కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఓట్స్ పిండితో ప్యాన్‌కేక్స్, రోటీలు, కుకీస్, మఫిన్స్‌తో పాటు మసాలా వడలు.. మొదలైనవి కూడా చేసుకోవచ్చు.

**జొన్న పిండి**

జొన్నల్లో శరీరానికి కావాల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. ఒకప్పుడు వీటిని ప్రధాన ఆహారంగా తీసుకునేవారు. బియ్యం వినియోగం పెరగడంతో వీటి ప్రాధాన్యం తగ్గింది. అయితే ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునేవారు జొన్నలకు ఇటీవల కాలంలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది జీర్ణశక్తిని మెరుగుపరచడంతో పాటు శరీర బరువుని అదుపులో పెట్టుకోవడానికి ఉపయోగపడుతుంది. జొన్న పిండితో రొట్టెలతో పాటు దోశలు, ఉప్మా, లడ్డూలు, మఫిన్లు, మురుకులు.. మొదలైనవి కూడా చేసుకోవచ్చు. మైదా పిండికి బదులుగా ఆహారంలో జొన్న పిండిని భాగం చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందచ్చంటున్నారు నిపుణులు.

**గోధుమ పిండి**

రిఫైన్డ్ గోధుమల నుంచి మైదా పిండిని తయారు చేస్తారు. ఈ క్రమంలో పలు రసాయనాలనూ కలుపుతారు. అందువల్లే ఇది తెలుపు రంగులో ఉంటుంది. అయితే మైదా కంటే గోధుమ పిండితో చేసిన వంటకాలు మంచివంటున్నారు నిపుణులు. భారతీయ వంటకాల్లో ఎప్పట్నుంచో గోధుమ పిండికి ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో ఫైబర్, బి విటమిన్లు.. మొదలైన పోషకాలు ఎక్కువగా ఉంటాయి.






# సినిమా

## 'జన నాయగన్'కు మరోసారి చుక్కెదురు!



విజయ్ కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందిన 'జన నాయగన్' కు మరోసారి చుక్కెదురైంది. 'జన నాయగన్' యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. నేడు ఆ తీర్పును మద్రాసు హైకోర్టు పక్కనపెట్టింది. మరోసారి విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని తిరిగి సింగిల్ బెంచ్‌ను ఆదేశించింది. సెన్సార్ బోర్డుకు తన వాదనలు వినిపించడానికి న్యాయపరమైన అవకాశాలు ఇవ్వాలని మద్రాసు హైకోర్టు పేర్కొంది. అలాగే, ఈ వ్యవహారాన్ని రివైజింగ్ కమిటీకి పంపిన నిర్ణయం సరైనదా కాదా.. అనే అంశాన్ని సింగిల్ జడ్జి స్వేచ్ఛగా పరిశీలించి నిర్ణయం తీసుకోవచ్చని హైకోర్టు పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని తగినవిధంగా మరోసారి విచారణ చేసి ఆదేశాలు జారీ చేసే అధికారం సింగిల్ బెంచ్‌కు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ సినిమా విడుదల మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. జన నాయగన్‌కు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు జనవరి 9న మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. కేసు విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. ఈ స్టేను సవాలు చేస్తూ నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీని విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. జనవరి 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. మరోసారి విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని నేడు సింగిల్ బెంచ్‌ను ఆదేశించింది.

## ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్.. 'దేవర 2' అప్‌డేట్ ఇచ్చిన నిర్మాత



ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'. 2024లో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా మంచి ఆదరణను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత దీనిపై పెద్దగా అప్‌డేట్స్ రాకపోవడంతో నెట్టింట రకరకాల వార్తలు ప్రచారమయ్యాయి. తాజాగా ఈ సినిమా నిర్మాత సుధాకర్ ఓ కార్యక్రమంలో 'దేవర 2' అప్‌డేట్ పంచుకున్నారు. ఈ ఏడాది మేలో దీని సీక్వెల్ పనులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాదిలో సినిమాను విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దీంతో అభిమానులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. 'దేవర' విడుదలై ఏడాదైన సందర్భంగా గతేడాది సెప్టెంబర్‌లో నిర్మాణసంస్థ ఈ సీక్వెల్‌పై ఓ పోస్ట్ పెట్టింది. ''ప్రపంచం ఎప్పటికీ గుర్తుపెట్టుకునే పేరు ఇది. తాను పంచిన ప్రేమ, తాను చూపిన భయం.. ఎప్పటికీ మర్చిపోలేరు. 'దేవర 2' కోసం అందరూ సిద్ధంగా ఉండండి'' అని పేర్కొంది. 'దేవర 2'పై కొరటాల గతంలో కొన్ని ఇంటర్వ్యూల్లో మాట్లాడి అంచనాలు పెంచేశారు. మొదటిభాగం కంటే రెండో భాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని ఆయన వెల్లడించారు. పార్ట్ 1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు.

## దీపికా పదుకొణె నా లక్కీ ఛార్మ్.. 'ఏఏ 22'పై అట్లీ ఆసక్తికర వ్యాఖ్యలు

అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ ఓ భారీ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏఏ 22' వర్కింగ్ టైటిల్. ఎంతో బిజీగా ఉన్న ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. ఆ సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ మూవీ హీరోయిన్ దీపికా పదుకొణె తన లక్కీ ఛార్మ్ అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో దీపిక చాలా కొత్తగా కనిపిస్తారని, ఆమె నటన కట్టిపడేస్తుందంటూ కొనియాడారు. షారుక్‌ఖాన్ దీపిక ప్రధాన పాత్రల్లో అట్లీ తెరకెక్కించిన 'జవాన్' ఘన విజయం సాధించిన విషయం విదితమే. 'ఏఏ 22' అప్‌డేట్ ఇవ్వలేదుగానీ ప్రేక్షకులకు కొత్త అనుభూతి పంచేందుకు తన టీమ్ ఎంత కష్టపడుతుందన్న అంశాన్ని అట్లీ వివరించారు. మేకింగ్ పరంగా ప్రతిరోజూ కొత్త విషయాలు తెలుసుకుంటున్నానన్నారు.

## హ్యాపీకి 20 ఏండ్లు



తెలుగు యువతను ఒక ఊపు ఊపిన చిత్రాల్లో 'హ్యాపీ' ఒకటి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మూవీ కెరీర్‌లో క్లాసిక్ హిట్‌గా నిలిచింది. ఇందులో బన్నీ డ్యాన్స్ కు అభిమానులు ఫిదా అయ్యారు. టి. కరుణాకరన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా విడుదలై నేటితో 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా ఒక ఎమోషనల్ పోస్ట్‌ను షేర్ చేస్తూ మధుర జ్ఞాపకాలను పంచుకున్నాడు. 'నా కెరీర్‌లో అత్యంత ఆనందాన్ని ఇచ్చిన సినిమాల్లో 'హ్యాపీ' ఒకటి. అద్భుతమైన విజన్‌తో ఈ కథను తెరకెక్కించిన దర్శకుడు ఎ. కరుణాకరన్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నా సహనటి జెనీలియా, విలక్షణ నటుడు మనోజ్ బాజ్‌పేయ్, అలాగే ఇతర నటీనటులు ఈ సినిమాను నిజంగా ఒక ఆనందకర ప్రయాణంగా మార్చారు. ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌యువన్ శంకర్ రాజా ప్రాణం పోశారు. సినిమా కోసం కష్టపడ్డ ప్రతి ఒక్క సాంకేతిక నిపుణుడికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ ప్రాజెక్ట్‌కు బలంగా నిలిచిన నా తండ్రి అల్లు అరవింద్ గారు, ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ కు స్పెషల్‌థాంక్స్. ప్రేక్షకుల ప్రేమ, ఆదరణే ఈ సినిమాను చిరస్మరణీయంగా నిలిపింది' అంటూ ఆనాటి మెమోరీస్‌ను గుర్తుచేసుకున్నాడు.



## మాటల్లేవ్


### ఆసక్తికరంగా విజయ్ సేతుపతి 'గాంధీ టాక్స్' ట్రైలర్

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటించిన లేటెస్ట్‌మూవీ 'గాంధీ టాక్స్'. కిశోర్ పాండురంగ్ బేలేకర్ తెరకెక్కిస్తున్న ఈమూవీలో అదితి రావు హైదరీ, అరవింద్ స్వామి, సిద్ధార్థ్ జాదవ్, మహేశ్ మంజ్రేకర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. డైలాగులు లేని మూకీ సినిమాగా ఇది రూపుదిద్దుకోవడం విశేషం. ప్రకటించిన రోజు నుంచే అందరిలో ఆసక్తిని కలిగించిన ఈ మూవీ ఈనెల 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'ప్రతి స్టోరీకి మాటలు అవసరం లేదు.. కొన్ని దృశ్యాలు చూడడంతోనే మనసుకు హత్తుకుంటాయి. ఈ సారి స్క్రీన్‌పై మాటలు ఉండవు.. అది మిమ్మల్ని వినేలా మాత్రమే చేస్తుంది' అంటూ చెబుతున్న డైలాగ్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నటీనటుల యాక్టింగ్‌తో పాటు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ సినిమాకు హైలైట్‌గా నిలవనుంది.



## డబ్బింగ్ బిగిన్స్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. హరీశ్ శంకర్ తెరకెక్కిస్తోన్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే కంప్లీట్ అయ్యింది. వీలైనంత త్వరగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా డబ్బింగ్ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలియజేస్తూ మూవీ టీం సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. దీనిని ఈ ఏడాది మార్చి 26న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు టాక్ నడుస్తోంది. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇందలో పోలీస్ ఆఫీసర్‌గా పవన్ స్టైలిష్ కనిపించనున్నాడు.. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్‌అందిస్తున్నాడు. 'ఈసారి పర్ఫార్మెన్స్ బద్ధలైపోద్ది' అంటూ ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమా రేంజ్‌ను చెప్పకనే చెప్పగా, ఇప్పుడు డబ్బింగ్ పనులు మొదలవ్వడం సినిమా విడుదలకు అడుగులు వేగంగా పడుతున్నాయనే సంకేతాలను ఇస్తోంది. ఇక 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత పవన్, హరీశ్ శంకర్ దేవిశ్రీ ప్రసాద్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.



## ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ఉంది.. చిరంజీవి వ్యాఖ్యలపై గాయని చిన్మయి స్పందన!



ఇండస్ట్రీలో కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని.. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవని చిరంజీవి కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ అంశంపై గాయని చిన్మయి స్పందించారు. పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉందని ఆమె అన్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఎక్స్ వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఇండస్ట్రీలో నిబద్ధత అనే పదానికి పూర్తి భిన్నమైన అర్థం ఉందని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ''సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ సమస్య ఎక్కువగా ఉంది. కమిట్‌మెంట్ ఇవ్వకపోతే కొత్త వారికి అవకాశాలు రావు. సాధారణంగా కమిట్‌మెంట్ అంటే వృత్తిపరమైన నిబద్ధత అనే అర్థం. కానీ, ఇండస్ట్రీలో మాత్రం దాని అర్థం వేరు. కొందరు పురుషులు ఈ పదాన్ని ఉపయోగించి మహిళల నుంచి ఏవేవో ఆశిస్తారు. గతంలో ఓ ప్రముఖ సింగర్ ఇండస్ట్రీలో ఎదురైన చేదు అనుభవాలకు భయపడి ఈ రంగాన్నే వదిలివెళ్లిపోయింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంతోమంది ఇక్కడ వేదికలపై స్పీచ్‌లు ఇస్తూనే ఉన్నారు'' అని చిన్మయి తెలిపారు. తాను కూడా గతంలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. తన తల్లి సమక్షంలోనే ఎంతో నమ్మిన ఒక పెద్దాయన తనతో తప్పుగా ప్రవర్తించాడని అసహనం వ్యక్తం చేశారు. చిరంజీవి ఓ లెజెండ్ అని ఆమె అన్నారు. ఆయన తరంలో నటీనటులంతా ఒకరితో ఒకరు స్నేహభావంతో ఉండేవారని.. పరస్పరం గౌరవించుకునే వారని చెప్పారు. లెజెండ్‌లతో కలిసి వర్క్ చేసిన వారు కూడా తన దృష్టిలో గొప్పవారేనని చిన్మయి తెలిపారు. ఇటీవల 'మన శంకరవరప్రసాద్ గారు' సక్సెస్ మీట్‌లో చిరంజీవి ఇండస్ట్రీ గురించి మాట్లాడారు. 'సినీ ఇండస్ట్రీ అద్దంలాంటిది. మనం ఎలా ఉంటామో అలాంటి ఫలితమే వస్తుంది. ఎవరైనా సరే సినీ ఇండస్ట్రీలోకి వస్తానంటే వారిని ప్రోత్సహించాలి. ఇది గొప్ప ఇండస్ట్రీ. 'ఇక్కడ నెగెటివ్ పీపుల్ ఉంటారు. చేదు అనుభవాలు ఎదురవుతాయి' అనుకుంటే అది నీ తప్పిదం. నువ్వు నిక్కచ్చిగా ఉంటే ఎవరూ అవకాశం తీసుకోరు. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవు . నువ్వు ప్రొఫెషనల్‌గా ఉండాలి. కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం లభిస్తూనే ఉంటుంది' అని ఆయన అన్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.